సోమవారం
23-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 211
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హోరెత్తిన ఫ్రాన్స్

పింఛన్ సంస్కరణలకు వ్యతిరేక నినాదాలతో ఫ్రాన్స్ హోరెత్తింది. రాజధాని పారిస్‌లో 1,50,000 మందికి రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. లా ఫ్రాన్స్ ఇన్‌సామైజ్ (ఎల్ఎఫ్ఐ) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. శనివారం 14వేల మంది నిరసన తెలిపినట్లు ఆక్యురెన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది.

2లో

ప్రపంచ సంఘీభావం అవసరం

- ప్రతి ఒక్కరి కోసం న్యాయవంతమైన ప్రపంచ నిర్మాణంలో కలిసి నడుస్తాం
- క్యూబా సంఘీభావ సభలో అలైదా గువేరా

విశాలాంధ్ర -హైదరాబాద్ :
అమెరికా అమానవీయ ఆంక్షలను అంతమొందించడానికి అంతర్జాతీయ సంఘీభావం అవసరమని ప్రపంచ విప్లవ యోధుడు చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా నొక్కి చెప్పారు. ఆంక్షలను ఎదురించి క్యూబా ప్రజలు వారి జీవితాలను, సమాజ పరిపూర్ణతను కొనసాగిస్తున్నారని తెలిపారు. సామ్యవాద సమాజాన్ని మెరుగుపర్చే విధంగా కొత్త తరాలకు విలువల శిక్షణను ఇవ్వడానికి ముందుకు సాగుతున్నామన్నారు. ఆదివారం సాయంత్రం ఇక్కడి రవీంద్రభారతిలో నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా (ఎన్‌సీఎస్‌సీ), ఐప్సో (ఏఐపీఎస్‌వో) సంయుక్త అధ్వర్యంలో క్యూబా సంఘీభావ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ అలైదా గువేరా, చే గువేరా మనవరాలు ఎస్తేఫానియా గువేరా విచ్చేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి అలైదా గువేరా ప్రసంగిస్తూ, మెరుగైన ప్రపంచం మానవాళికందరికీ అవసరమని అన్నారు. దురదృష్టవశాత్తు మనం జీవన నైతికతను కోల్పోతున్నామని, అందువలన మనుగడ హక్కును కూడా కోల్పోతున్నామని తెలిపారు. యుద్ధాలు, మహమ్మారీల మధ్య మన సహజ ఆవాసాలను కోల్పోతున్నామని, అయితే ఇలాంటి పరిస్థితుల్లో కూడా మనలో చాలా మందిలో ఉదాసీనత నెలకొందని అన్నారు. మహమ్మారి వలన క్యూబా ఆర్థికాభివృద్ధి చాలా పెద్ద మొత్తంగా దెబ్బతిన్నది. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా ప్రపంచంలాగే తాము విప్లవ మొదటినాళ్లనుంచి అనుభవిస్తున్న ఆర్థిక ఆంక్షలు మరింత తీవ్రతరం అయ్యాయని ఆమె చెప్పారు. అమెరికా ప్రభుత్వం తన చట్టాలను ఖండాంతర స్వభావంలో రూపొందించిందని, క్యూబా వాణిజ్యాన్ని ఇతర ప్రపంచ ప్రజలతోటి నివారించాలని చూస్తోందని అన్నారు. క్యూబాకు అందమైన బీచ్‌లు, పర్యాటకుల భద్రత వల్ల పర్యాటక రంగంలో మంచి అభివృద్ధి ఉన్నప్పటికీ, పర్యాటక రంగ అభివృద్ధికి కావాల్సిన విమానాలు తమ వద్ద లేవని తెలిపారు. దీంతో విమానాలను అద్దెకు తీసుకోవాలని ప్రయత్నించినప్పుడు, అమెరికా ప్రభుత్వం 10 శాతం వరకు అమెరికా విడి భాగాలు ఈ విమానాల్లో ఉంటే, ఈ వాణిజ్య మార్పిడిని నిషేధించడం వాళ్ల హక్కుగా భావిస్తున్నారని తెలిపారు. ఒకవేళ ఏదైనా కంపెనీ ఈ వాణిజ్యానికి ధైర్యం చేస్తే వాళ్ల మీద మిలియన్ల దాలర్లు జరిమానా వేసే శక్తి కలిగి ఉందని అన్నారు. లేకపోతే ఈ కంపెనీలను అమెరికా మార్కెట్లో వాళ్ల వస్తువులను అమ్ముకోకుండా చేస్తామని బెదిరిస్తుందని, దీనివల్ల మాకు అవసరమైన వస్తువులను సమకూర్చుకోలేక పోతున్నామని చెప్పారు. అలాగే ఆహారం, మందుల విషయంలోను ఇదే పరిస్థితి ఉందని, తాము ఎఫ్‌బీఐ కళ్లుగప్పి ముగ్గురు లేక ఎక్కువ మంది మధ్యవర్తులకు ఎక్కువ మోతాదులో డబ్బు చెల్లించి మా ప్రజలకు కావాల్సిన సామాన్య నిత్యావసర వస్తువులను సమకూర్చుకోవాల్సి వస్తుందని వివరించారు. ఈ రకమైన అమానవీయ ఆంక్షలను అంతమొందించడానికి అంతర్జాతీయ సంఘీభావం అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అయినప్పటికీ, క్యూబా ప్రజలు వారి జీవితాలను, వారి సమాజ పరిపూర్ణతను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల కొత్త ఫ్యామిలీ కోడు, మానవ సంబంధాల మెరుగు కోసం, చిన్న పిల్లల, వృద్ధుల హామీ కోసం, క్యూబా మహిళల ఇంటిగ్రిటీ హామీని కొనసాగించడానికి, సామ్యవాద సమాజాన్ని మెరుగుపర్చే విధంగా కొత్త తరాలకు విలువల శిక్షణను ఇవ్వడానికి ఆమోదించినట్లు అలైదా గువేరా చెప్పారు. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ వేల మంది వైద్యులను ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు పంపించడం ద్వారా, మహమ్మారి కాలంలో ఇటలీ, స్పెయిన్ దేశాలకు వారి కోవిడ్ యుద్ధంలో సహాయం చేయడానికి వైద్య నిపుణుల బృందాలను పంపించడం ద్వారా, ఇంకా ఇలాంటి మరెన్నో చర్యల ద్వారా తమ సంఘీభావాన్ని ప్రపంచ ప్రజలందరితో కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోనే ఆర్థికంగా, సైనికపరంగా అత్యంత శక్తివంతమైన దేశంతో ఎదురింపబడి, మారణ హోమానికి దారితీసే ఆందోళకు గురైన క్యూబా తన దేశ

- మిగతా 2 లో

లంబసింగికి ముప్పు

- సహజంగా ఏర్పడే అతి శీతల వాతావరణం
- పాలకడలిని తలపించే వంజంగి.. ఆకట్టుకునే తాజంగి
- ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న పర్యాటకం
- నేషనల్ హైవే 516ఈతో పొంచి ఉన్న ప్రమాదం
- భారీ స్థాయిలో నేలకొరగనున్న చెట్లు, ప్రకృతి అందాలు

విశాలాంధ్ర-చింతపల్లి:
మన్యం ప్రాంతంలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన లంబసింగి రానున్న కాలంలో కనుమరుగు కానుందా... అంటే అవుననే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నేషనల్ హైవే 516ఈతో ఈ పర్యాటక ప్రాంతానికి పెను ప్రమాదమే పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. 'ఆంధ్ర కశ్మీర్'గా పేరొందిన లంబసింగి అంటే రాష్ట్రంలో తెలియని వారుండరు. చుట్టూ ప్రకృతి సిద్ధమైన పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, అతి శీతల వాతావరణం, ఆకాశమే నేలపైకి దిగి వచ్చిందా...అని భ్రమింప జేసే పాల నురుగును తలపించే పొగ మంచు ఈ ప్రాంతం ప్రత్యేకత. లంబసింగిని కూడలిని మొదట్లో కొర్రుబైలు అని పిలిచే వారు. ఓ బిక్షగాడు ఆ రాత్రి చెట్టు కింద నిద్రించి తెల్లవారే సమయానికి చలిని తట్టుకోలేక

- మిగతా 2 లో

నేడు విజయవాడకు అలైదా, ఎస్తేఫానియా

క్యూబా సంఘీభావ సభకు ఏర్పాట్లు పూర్తి

లాటిన్ అమెరికా విప్లవయోధుడు చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా సోమవారం విజయవాడకు రానున్నారు. వారి భారత పర్యటన సందర్భంగా నిర్వహించే క్యూబా సంఘీభావ సభలో ప్రసంగించనున్నారు. 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎంబీవిజ్ఞాన కేంద్రంలో జరిగే సభలో వారిరువురికీ పౌర సన్మానం నిర్వహించనున్నారు.

2లో

బీజేపీ ఆశలు హుళక్కే

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురు దెబ్బే

తాజా సర్వేలో వెల్లడి



బెంగళూరు :
దేశంలో కాషాయ పార్టీ బీజేపీ అధికార ప్రాభవం క్షీణిస్తోంది. దక్షిణాది రాష్ట్రమైన కర్ణాటకలో ఆ పార్టీ మళ్లీ గద్దె నెక్కే పరిస్థితి లేదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. రానున్న కర్ణాటక శాసన సభ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని కోల్పోతుందని, కాంగ్రెస్ భారీ ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఎస్ఏఎస్ గ్రూప్ సర్వే అంచనా వేసింది. 224 స్థానాల్లో బీజేపీకి కేవలం 65 నుంచి 75 స్థానాలు మాత్రమే వస్తాయని తెలిపింది. కాంగ్రెస్‌కు 108 నుంచి 114 స్థానాలు, జేడీఎస్‌కు 24 నుంచి 34 స్థానాలు లభించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కర్ణాటకలోని ఐపీఎస్ఎస్ టీమ్‌తో కలిసి నవంబరు 20 నుంచి జనవరి 15 వరకు ఈ సర్వేను నిర్వహించినట్లు హైదరాబాద్‌కు చెందిన ఎస్ఏఎస్ గ్రూప్ ప్రకటించింది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం పెరుగుతుందని, బీజేపీ ఓట్ల శాతం తగ్గుతుందని వెల్లడయిందని తెలిపింది. కాంగ్రెస్‌కు

- మిగతా 2 లో

ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం కొనసాగింపు

- గవర్నరు ఆర్డినెన్స్ జారీ
- స్వాగతించిన ప్రతిపక్ష పార్టీలు, దళిత, ప్రజా సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక (సబ్‌ప్లాన్) చట్టం పునరుద్ధరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా గవర్నరు ద్వారా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని యథాతథంగా కొనసాగిస్తూ జీవో నంబరు-7ను రాష్ట్ర శాసన వ్యవహారాలు, న్యాయశాఖ కార్యదర్శి ఆదివారం ఉత్తర్వులు జారీజేశారు. 2013-ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ప్రత్యేక అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్ని నిర్వహించారు. సమాజంలోని మిగిలిన వర్గాలకు సమానంగా ఉండాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను ప్రవేశపెట్టి, దానికి ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పోనీలెండి, పనీపాటా లేకుండా ఇంకొన్నాళ్లు కాలక్షేపం చేయొచ్చు!

డీఎస్సీ లేనట్టేనా!

జగన్ ప్రభుత్వం దగా

అభ్యర్థుల పడిగాపులు

మరో మూడేళ్ల వరకు ప్రకటన కష్టమే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ ఇక లేనట్లేనని తెలుస్తోంది. దీనికి రాష్ట్ర విద్యా వ్యవస్థలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణంగా నిలుస్తున్నాయి. 2021లో పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ పోస్టుల వివరాలపై ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు దానిపై 53వేల పోస్టులున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి బదులిచ్చారు. తాజాగా ఆ పోస్టులు 30వేల వరకు కుదించుకుపోయాయని తెలిసింది. మిగిలిన పోస్టులనూ సర్దుబాటు పేరుతో, ప్రభుత్వం చేపట్టిన వివిధ విద్యా సంస్కరణలు, జీవో నంబరు-117, 128 ప్రభావంతో భారీగా తగ్గిపోనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా మరో మూడేళ్ల వరకు రాష్ట్రంలో డీఎస్సీ ప్రకటించడం గగనమేనని ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తున్నాయి. ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై సీఎం జగన్ ప్రభుత్వం పూర్తిగా దగా చేసిందని అభ్యర్థులు మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా 10వేల పోస్టులతో జంబో డీఎస్సీ ఇస్తామంటూ

- మిగతా 2 లో

హోదా, విభజన హామీల సాధన కోసం

25 నుంచి సమరయాత్ర

- విద్యార్థి,యువజన సంఘాల ప్రకటన
- విద్యా సంస్థలకు నిధులేవీ ?
- పోలవరం, పోర్టులపై నిర్లక్ష్యమని విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈ నెల 25నుంచి ప్రారంభమయ్యే సమరయాత్ర(బస్సుయాత్ర)ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. విజయవాడలోని బాలోత్సవభవన్‌లో ఆదివారం విద్యార్థి, యువజన సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఐదుకోట్ల ఆంధ్రులను మోసం చేసిన కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరాయి. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర

- మిగతా 2 లో

నేడు విజయవాడకు అలైదా, ఎస్తేఫానియా

విశాలాంధ్ర-విజయవాడ : లాటిన్ అమెరికా విప్లవయోధుడు చే గువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా, మనుమరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా సోమవారం విజయవాడకు రానున్నారు. వారి భారత పర్యటన సందర్భంగా నిర్వహించే క్యూబా సంఘీభావ సభలో ప్రసంగించనున్నారు. 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎంబీవిజ్ఞాన కేంద్రంలో జరిగే సభ లో వారిరువురికీ పౌర సన్మాన నిర్వహించనున్నారు. క్యూబాను కాపాడుకొనేందుకు, అమెరికా నియంతృత్వంపై పోరాడేందుకు నిర్వహిస్తున్న పర్యటనల్లో భాగంగా క్యూబా జాతీయ సంఘీభావ కమిటీ ఆహ్వానం మేరకు భారత దేశంలో ఈ నెల 4వ తేదీ నుంచి వారు పర్యటిస్తున్నారు. ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాలు, మేధావులు, సామ్రాజ్యవాద వ్యతిరేకులు ఆమెకు ఘనస్వాగతం పలకనున్నారు. . బూర్జువా పాలకవర్గ ముఠాలకు రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రపంచ ప్రజల కోసం, అసమానతల సమాజం నుండి విముక్తి కోసం, స్వార్థత్యాగం అనేది ఎంత విలువైనదో తెలియపరిచే చే గువేరా జీవితం నుండి స్ఫూర్తిని పొందాల్సిన అవసరం ఉంది. సామ్రాజ్యవాదుల, దోపిడీ శక్తుల ప్రయోజనాలకోసం పేట్రెగుతున్న మతోన్మాద పూరిత వాతావరణంలో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే నిజమైన దేశభక్తుల త్యాగపూరిత పోరాట సాంప్రదాయాన్ని అందిపుచ్చుకోవాల్సి బాధ్యత మనపై ఉంది.

సీజేఐ ఆలోచన అభినందనీయం: మోదీ

న్యూదిల్లీ: ప్రాంతీయ భాషల్లో తీర్పులను సుప్రీంకోర్టు వెలువరించాలన్న సీజేఐ డీవై చంద్రచూడ్ ఆలోచన అభినందనీయమని ప్రధాని మోదీ అన్నారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సీజేఐ చంద్రచూడ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పులు ప్రాంతీయ భాషల్లో వెలువడాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం సాంకేతికత వినియోగం అవశ్యమన్నారు. ఈ ఆలోచన అభినందనీయం. అనేకమందికి ముఖ్యంగా యువతకు సహాయపడుతుంది' అని మోదీ ఆదివారం ట్వీట్‌చేశారు. మహారాష్ట్ర బార్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ ప్రసంగానికి సంబంధించిన క్లిప్‌ను పోస్టు చేశారు. భారత్‌లో అనేక భాషలు-సంస్కృతులు ఉన్నాయి. ఇంజినీరింగ్, వైద్యవిద్య సైతం మాతృభాషలో అందజేసేందుకు కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది' అని మరొక ట్వీట్‌లో మోదీ పేర్కొన్నారు.

3న కేరళ బడ్జెట్
నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు ఈనెల 23 నుంచి మార్చి 30 వరకు జరగనున్నాయి. ఎల్డీఎఫ్ ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 3న ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో బడ్జెట్‌పై చర్చలు జరుగుతాయని స్పీకర్ ఏఎన్ షంషీర్ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 33 రోజుల సెషన్ సోమవారం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ప్రసంగంతో ప్రారంభమవుతుందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ఈనెల 25న, ఫిబ్రవరి 1, 2 తేదీలతో జరుగుతుందని చెప్పారు. ప్రత్యేక మంత్రివర్గ సమావేశం సీఎం విజయన్ అధ్యక్షతన జరిగిందని, బడ్జెట్‌పై చర్చించిందన్నారు. కేరళ అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన ముసాయిదా తయారుచేసే బాధ్యతలను మంత్రుల సబ్ కమిటీకి అప్పగించినట్లు వెల్లడించారు.

ఉప ప్రణాళిక చట్టం కొనసాగింపు

(మొదటిపేజీ తరువాయి)

చట్ట రూపంలోకి తెచ్చారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి, వారికి విద్య, ఉపాధి, సంక్షేమం లక్ష్యంతో దీనిని రూపొందించింది. ఇందుకోసం 10శాతం నిధులనూ కేటాయించాలని చట్టం చేసింది. క్రమేపీ ఆ నిధుల్ని ప్రభుత్వాలు స్వార్థ ప్రయోజనాల కోసం సక్రమంగా కేటాయించకపోవడం, ఉన్న నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించడంతో వెరసి పథకం ఆశయం పక్కదారి పట్టింది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు గడువును పదేళ్ల కాలపరిమితితో కొనసాగిస్తూ చట్టం తేగా, అది ఈనెల 23వ తేదీతో ముగియనుంది. దీనిని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్)తోపాటు వివిధ రాజకీయపక్షాలు, ప్రజా సంఘాలు విన్నవించాయి. ఎట్టకేలకు సీఎం జగన్ ప్రభుత్వం స్పందించి, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను యథాతథంగా కొనసాగిస్తూ, గవర్నరు ద్వారా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఆ మేరకు జీవో నంబరు-7 ద్వారా ఉత్తర్వులు జారీజేసింది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికను కొనసాగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వివిధ రాజకీయ పార్టీలు, దళిత, ప్రజా సంఘాలు స్వాగతించాయి.

ఈ చట్టం ఎప్పుడో పునరుద్ధరించాల్సింది: జల్లి విల్సన్, మాజీ ఎమ్మెల్సీ

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని గవర్నరు ఆర్డినెన్స్ ద్వారా పొడిగించడం హర్షణీయమని, అయితే ఈ చట్టాన్ని ఎప్పుడో రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ చేసి ఉంటే, దళిత ప్రజానీకం భయాందోళన చెంది ఉండేవారు కాదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ చట్టం అమలులో కొరవడిన నిర్లక్ష్యం, నిధుల కేటాయింపు, వినియోగం తదితర అంశాలపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో దళిత, సంక్షేమ అభివృద్ధి కోసం లోతైన సమీక్షించి, చట్టం నీరుగాకుండా పక్కాగా రూపొందించాలని సూచించారు.

స్వాగతించిన కాంగ్రెస్

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్సు తీసుకు రావడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు స్వాగతించారు. రాష్ట్రంలోని దళిత గిరిజన సంఘాలు, వివిధ రాజకీయ పక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చినందుకు ప్రభుత్వం దిగివచ్చి ఈ ఆర్డినెన్సు ఇచ్చిందన్నారు. ఇది దళిత గిరిజన శక్తుల పోరాట విజయంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.

సీపీఎం హర్షం

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగిస్తూ గవర్నరు ఆర్డినెన్స్ తీసుకురావడంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు హర్షం తెలిపారు. ఈ ఆర్డినెన్సును అసెంబ్లీలో చట్ట రూపంలో తీసుకురావాల్సి ఉందనీ, ఆ సమయంలో పాత చట్టంలో ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట గడువుతో నిమిత్తం లేకుండా సమాజంలోని అన్ని తరగతులతోపాటు ఎస్సీ, ఎస్టీలు, వారి నివాసిత ప్రాంతాలు సమానంగా అభివృద్ధి అయ్యేదాకా ఈ చట్టం కొనసాగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సబ్‌ప్లాన్‌కు చట్టభద్రత కల్పిస్తూ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కొనసాగించడంపై డీబీఎఫ్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ ఎంటర్ ఫర్ దళిత స్టడీస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య తదితరులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

హోరెత్తిన ఫ్రాన్స్

పింఛన్ సంస్కరణలకు నిరసన
పారిస్‌లో 1,50,000 మంది ఆందోళన

పారిస్: పింఛన్ సంస్కరణలకు వ్యతిరేక నినాదాలతో ఫ్రాన్స్ హోరెత్తింది. రాజధాని పారిస్‌లో 1,50,000 మందికి రోడ్లపైకొచ్చి నిరసన తెలిపారు. లా ఫ్రాన్స్ ఇన్‌సొమైజ్ (ఎల్‌ఎఫ్‌ఐ) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. శనివారం 14వేల మంది నిరసన తెలిపినట్లు ఆక్కురెన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. అయితే ఇవి తప్పుడు లెక్కలని, నిరసనకారుల సంఖ్యను ఈ సంస్థ తక్కువ చేసి చూపుతోందని, మాక్రాన్ మద్దతుదారు కాబట్టే అలా చేస్తోందని ఎల్‌ఎఫ్‌ఐ పార్టీ నాయకుడు జీన్‌లుక్ మెలన్‌చోన్ వ్యాఖ్యానించారు. 1,50,000 మందికిపైగా పారిస్‌లో ఆందోళన చేసినట్లు తెలిపింది. ఈ క్రమంలో శనివారం కాస్త ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు ట్రాఫిక్ లైట్లను ధ్వంసం చేశారు. టపాసులు కాల్చారు. చెత్త డబ్బాలకు నిప్పుపెట్టారు. ఏటీఎం యంత్రాలు, బ్యాంకుల కిటీలను ధ్వంసం చేశారు. పోలీసులపై గాజు సీసాలు విసిరారు. 'డౌన్ విత్ కేపిటలిజం' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తీరును తప్పుపట్టారు. చివరి వరకు పోరాడతామని తేల్చిచెప్పారు. జనవరి ఆరంభంలో ఫ్రాన్స్ ప్రధాని ఎలిజబెత్ బోర్న్ వివాదాస్పద ఫించన్ సంస్కరణకు సంబంధించిన ముసాయిదాను విడుదల చేశారు. 2023లో దీనిని అమలు చేసే యోచనలో ప్రభుత్వమున్నట్లు తెలిపారు. ఈ ముసాయిదా ప్రకారం 2023 సెప్టెంబరు 1 నుంచి పదవీ విరమణ వయస్సు మూడు నెలలు చొప్పున క్రమంగా పెరగుతూ 2030 నాటికి 64ఏళ్లకు చేరుతుంది. పింఛన్ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశంలోని కార్మికసంఘాలు ఈనెల19న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. పారిస్, మార్సెలీస్, లియాన్, టౌలోస్, లిల్లే, నాంటెస్‌లో ఆందోళనలు మిన్నంటాయి. గురువారం 200కుపైగా ఆందోళనలు దేశంలో జరిగాయి. 1.12 మిలియన్ల మంది పాల్గొన్నారు. ఒక్క పారిస్‌లోనే 80వేల మంది నిరసనకు దిగారు.

నాలుగేళ్లలో 42 మంది జర్నలిస్టుల హత్య

పాకిస్తాన్ మంత్రి ముర్తజా జావేద్ అబ్బాసి వెల్లడి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో 42మంది జర్నలిస్టులు నాలుగేళ్లలో హత్యకు గురయ్యారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ముర్తజా జావేద్ అబ్బాసి తెలిపారు. వీరిలో 15మంది పంజాబ్, 11మంది సింధ్, 13మంది ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా, ముగ్గురు బెలూచిస్తాన్‌లకు చెందిన పాత్రికేయులని ఆయన సెనేట్‌కు తెలిపారు. కొందరు జర్నలిస్టులు కాల్చివేతకు గురికాగా మరికొందరిని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఇంకొందరు ఆచూకీ లేకుండా పోయారన్నారు. ఈ కేసులకు సంబంధించి పంజాబ్‌లో ఏడుగురు అనుమానితులను అరెస్టు చేయగా వారిలో ఇద్దరు బెయిల్‌పై ఉన్నారని మంత్రి చెప్పారు. ఈ ఏడుగురిలో ఐదుగురిపై విచారణ జరుగుతోందన్నారు. ఎనిమిది మంది అనుమానితులు పరారీలో ఉన్నారని, ఒకరిని కోర్టు విడుదల చేసిందని తెలిపారు. అదే విధంగా సింధ్ ప్రావిన్స్‌లో నలుగురు అనుమానితులను అరెస్టు చేయగా, ఏడుగురు విచారణను ఎదుర్కొంటున్నట్లు ఆయన చెప్పారు. కేపీ ప్రావిన్స్‌లో ఇద్దరిని వదిలిపెట్టగా, నలుగురు విచారణ ఎదుర్కొంటున్నారు. బలూచిస్తాన్‌లో ఇద్దరు అనుమానితులు తప్పించుకుపోయారని, ఒకరు విచారణను ఎదుర్కొంటున్నారని మంత్రి వెల్లడించారు.

జమాత్ ఇస్లామీ ఎంపీ ముస్తాక్ అహ్మద్ కూడా సెనేట్‌లో మాట్లాడారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో ఫెడరల్, ప్రావిన్షియల్ ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. దోషులను పట్టుకొని ఉంటే అర్షద్ షరీఫ్ అమరుడయ్యేవారు కాదన్నారు. దీనిపై అబ్బాసి స్పందిస్తూ ఇది క్లిష్టమైన పరిస్థితని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, జర్నలిస్టులకు ప్రత్యేక భద్రతను ప్రభుత్వం కల్పించాలని అన్నారు. ఈ వ్యవహారంలో సమగ్ర నివేదికను రూపొందించింది రెండు నెలల్లోగా సెనేట్‌కు అందజేయాలని హోం, సమాచార శాఖలను అబ్బాసీ ఆదేశించారు. బలూచిస్తాన్‌లోనే పది మంది జర్నలిస్టులు హత్యకు గురైనట్లు బలూచిస్తాన్ అవామీ పార్టీ సెనేటర్ దానిశ్ కుమార్ కూడా అన్నారు.

అమెరికా క్లబ్‌లో కాల్పులు

10 మంది మృతి-16మందికి గాయాలు

మొంటరే పార్క్: అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. లాస్‌ఏంజిల్స్‌లోని ఓ క్లబ్‌లో ఆగంతకుడు మెషిన్‌గన్‌తో బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో పది మంది చనిపోగా 16 మందికి గాయాలైనట్లు సమాచారం. చంద్రయాన నూతన సంవత్సర వేడుకలు లాస్‌ఏంజిల్స్ కౌంటీలోని మొటరే పార్క్ వద్ద పెద్దఎత్తున జరిగాయి. వేలాది మంది సంబరాల్లో పాల్గొన్నారు. మొంటరే పార్క్‌లో గార్వే అవెన్యూలో రాత్రి కాల్పులు జరిగాయని లాస్ ఏంజిల్స్ కౌంటీ షరీఫ్ బాబ్ బోసే వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే స్పందించినట్లు తెలిపారు. ఓ వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులు జరిపి మారణహోమం సృష్టించినట్లు చెప్పారు. ఈ వేడుకల్లో లక్షమందికిపైగా పాల్గొన్నట్లు తెలుస్తోంది. కాల్పులపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలావుంటే 10 మంది చనిపోగా 16 మందికి గాయాలైనట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నట్లు లాస్ ఏంజిల్స్ టైమ్స్, బీబీసీ వంటి వార్తాసంస్థలు నివేదించాయి. స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి 10 గంటలకు కాల్పులు జరిగినట్లు వెల్లడించాయి. మెషిన్‌గన్‌తో దుండగుడు డ్యాన్స్ క్లబ్‌లో కాల్పులకు తెగబడినట్లు ప్రత్యక్ష సాక్షి, రెస్టారెంట్ యజమాని సియుంగ్ వాన్ చోయ్ తెలిపారు. తన రెస్టారెంట్‌లోకి కొందరు పరిగెత్తుకొచ్చి షట్టర్ మూసివేయాలని ప్రాధేయపడ్డారని ఆయన చెప్పారు.

బ్రెజిల్ ఆర్మీ కమాండర్‌పై లూలా వేటు

బ్రసిలియా: బ్రెజిల్ ఆర్మీ చీఫ్ జనరల్ జూలియో సిజర్ డె అర్రుడాను ఆ పదవి నుంచి లూలా ప్రభుత్వం తొలగించింది. జూలియో డె అరుద్రాను తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారి చేసినట్లు ఆ దేశ సైన్యం అధికారిక వెబ్‌సైట్ వెల్లడించింది. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో మద్దతుదారులు రాజధాని బ్రసిలియాలో సృష్టించిన అల్లర్లపై అధ్యక్షుడు లూలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలియో స్థానంలో జనరల్ టొమస్ మిగ్యూల్ రెబెరో పైవాను నియమించినట్లు పేర్కొంది. సైన్యంలోని కీలక వ్యక్తులే అల్లరి మూకలను రాజధానిలోకి అనుమతించారన్న ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకొన్నారు. తిరుగుబాటుకు సహకరించిన వారిపై చర్యలు ఉంటాయని అధ్యక్షుడు లూలా ఇటీవలే వెల్లడించిన విషయం విదితమే. దాడి ఘటనకు సంబంధించి అధ్యక్ష భవనంలో విధులు నిర్వహిస్తున్న 43 మందిని తొలగించింది. ప్రెసిడెన్సీ జనరల్ సెక్రటేరియట్ మంత్రిత్వ శాఖ అధ్యక్ష భవనమైన ప్లానాల్టో ప్యాలెస్‌లో సాయుధ దళాలతో పాటు ఇన్‌స్టిట్యూషనల్ సెక్యూరిటీ క్యాబినెట్ (జీఎస్‌ఐ) దళాలను తొలగించింది. ఏడుగురు ఉన్నతాధికారులతో పాటు నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీకి చెందిన దిగువ స్థాయి అధికారులు ఉన్నారు.

లంబసింగికి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

కొర్రుబారి మరణించాడని, అందుకే ఈ కూడలిని కొర్రుబైలు అని పిలుస్తారు. ఇక్కడి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో లమ్మసింగి, ఐదు కిలో మీటర్ల దూరంలో తాజంగి గ్రామాలున్నాయి. తాజంగి గ్రామంలో రైతులకు సాగునీరు అందించేందుకు నిర్మించిన జలాశయం, లమ్మసింగి నుంచి సుమారు మూడు కిలో మీటర్ల మేర కొండ ఎక్కితే చెరువుల వేనం గ్రామం వస్తుంది. తెల్లవారు జామున అక్కడి నుంచి కిందకు చూస్తే పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేసేందుకు ఒక సుందరమైన దృశ్యం దర్శనమిస్తుంది. ఈ సుందర దృశ్యం ఉదయం సుమారు ఆరు, ఏడూ గంటల వరకు మాత్రమే ఉంటుంది. ఇది ఎన్నో ఏళ్లుగా ఉన్నప్పటికీ బయట ప్రపంచానికి తెలియలేదు. కొర్రు బైలు కూడలిలో మాత్రం ఉదయం పదకొండు గంటలైనా మంచు దుప్పటి వీడదు. ఈ అద్భుత దృశ్యాలు బయట ప్రపంచానికి తెలిసేలా చేసేందుకు స్థానిక మీడియా ఎంతో కృషి చేసింది. మీడియా కృషి ఫలితంగా పదేళ్ల నుంచి ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. తెల్లవారు జామున ఉండే మన్యం మంచు అందాలను చూసేందుకు పర్యాటకులు ముందు రోజే వచ్చి ఇక్కడ క్యా కడుతున్నారు. పర్యాటకులు బస చేసేందుకు సరైన వసతులు లేకపోవడం, పదకొండు గంటల తరువాత సూర్యరశ్మి ధాటికి పొగ మంచు కనుమరుగు కావడం, ఆ తరువాత తిలకించేందుకు ఈ ప్రాంతంలో ఏమి లేకపోవడంతో కొంతమంది పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇది గమనించిన పర్యాటక శాఖ, పర్యాటకులను ఆకర్షించేందుకు రిసార్ట్స్, గిరిజన మ్యూజియం ఏర్పాటుకు కోట్ల రూపాయలు వెచ్చించింది. ప్రస్తుతం రిసార్ట్స్‌లో కొన్ని గదులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురాగా, గిరిజన మ్యూజియం పనులు కొద్ది రోజుల క్రితం మొదలు పెట్టారు. పర్యాటకుల నిరాశను తొలగించేందుకు స్థానిక గిరిజన యువత పాడేరు ఐటీడీఏ సహకారంతో తాజంగి జలాశయం వద్ద రోప్ వే, బోటు షికారు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతుండగా, కొంతమంది గిరిజనులు అక్కడక్కడా రిసార్ట్స్, గూడారాలు నిర్మించి ఉపాధి పొందుతున్నారు.

ఇదిలా ఉంటే... రాజమండ్రి నుంచి విజయనగరంలోని ఎన్‌హెచ్-26ను కలిపే నేషనల్ హైవే 516ఈ రహదారి ఈ ప్రాంతం మీదుగా వేసేందుకు పాలకులు, అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీంతో లంబసింగి ప్రాంతంలో కొన్ని వందల వృక్షాలు నెలకొరగనున్నాయి. పదుల సంఖ్యలో నివాస గృహాలు తొలగించబడనున్నాయి. వాహనాల రద్దీతో దుమ్ము, ధూళి పెరగనుంది. వృక్షాలు, గృహాల తొలగింపు, వాహనాల రద్దీతో వెలువడే కాలుష్యం వల్ల సహజ సిద్ధమైన వాతావరణం, పొగ మంచు అందాలు కనుమరుగై, పర్యాటకుల తాకిడి తగ్గే అవకాశం ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో జాతీయ రహదారి పేరిట ఈ ప్రాంతానికి విఘాతం కలిగే రీతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని ఈ ప్రాంతీయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో గృహాలు కోల్పోతున్న నిరుపేద గిరిజన కుటుంబాలు పర్యాటకం పేరుతో అభివృద్ధి మాటున రహదారి విస్తరణ అంటూ తమకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదని, ఈ నిర్ణయంతో తామంతా ఆందోళనతో జీవనం సాగించవలసిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

25 నుంచి సమరయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి జి.రామన్న, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కె. రవిచంద్ర, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, తెలుగు యువత నాయకులు నాగూరు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమేశ్వరరావు, రాజేష్, ఏఐవైఎఫ్ నాయకులు లంక గోవిందరాజులు తదితరులు సమరయాత్ర పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు రాష్ట్రానికి అన్ని విధాలుగా అన్యాయం చేసిన బీజేపీకి వ్యతిరేకంగా రాష్ట్ర హక్కుల కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ లేదనీ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు లేదనీ చెప్పారు. విశాఖ రైల్వేజోన్ ప్రస్తావనేలేదనీ, అమరావతి రాజధానికి నిధులు లేవన్నారు. 11 రకాల విద్యాసంస్థలకు నిధులు ఇవ్వకుండా దగా చేశారని, రామయపట్నం పోర్టు ఇవ్వలేదని, మంగళగిరి ఎయిమ్స్ పూర్తి చేయ్యలేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు సగం రెవెన్యూ లోటు తీర్చలేదనీ, ఇలా రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పాలన్నారు. సీఎం జగన్ ప్రధాని మోదీ జపం చేస్తూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఐదు కోట్ల ఆంధ్రులు కావాలో, మోదీ కావాలో జగన్ తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీసుల తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందనీ, ప్రజాస్వామ్య హక్కులను భంగం కలిగించేలా ఉన్నదని విమర్శించారు. బస్సుయాత్రకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పిస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోర్టులు జోక్యం చేసుకుంటేనే బస్సు యాత్రకు అనుమతిచ్చే పరిస్థితులున్నాయన్నారు. ఈ సమరయాత్రకు అన్ని రాజకీయ పార్టీలు కలసి రావాలని విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి.

డీఎస్సీ లేనట్టేనా!

(మొదటిపేజీ తరువాయి)

జగన్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. దాదాపు మూడున్నరేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ, వివిధ కోచింగ్ సంస్థల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి, శిక్షణ తీసుకుని ఆర్థికంగా అభ్యర్థులు నష్టపోతున్నారు.

మడం తిప్పిన జగన్

డీఎస్సీ ప్రకటనపై జగన్ మడం తిప్పారు. ఆయన అధికారంలోకి వచ్చే నాటికి 53వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నప్పటికీ...ఇంతవరకు ఒక్క పోస్టూ భర్తీ చేయకుండా కాలయాపన చేయడంతో చాలా మందికి వయోపరిమితి మించిపోయి, పోస్టులకు అర్హత లేకుండా పోయారు. దీనికి జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని విమర్శిస్తున్నారు. జగన్ ఇచ్చిన మాట ప్రకారం ఈ మూడున్నరేళ్లకుగాను ఏటా 10వేల చొప్పున లెక్కిస్తే, 30వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీచేయాల్సి ఉంది. వాటిలో ఇంతవరకు కనీసం ఒక్క పోస్టూ భర్తీ చేయనందున అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ పోస్టులు భర్తీ చేయాలంటూ విద్యాశాఖాధికారులకు, ప్రభుత్వానికి చాలాసార్లు వినతులు ఇచ్చినప్పటికీ ఎక్కడా స్పందన లేదు. ఉపాధ్యాయుల పోస్టులనే నమ్ముకుని డీఎస్సీ కోసం ఎదురు చూసిన వారంతా భంగపాటుకు గురయ్యారు.

డీఎస్సీ లేకపోవడానికి కారణాలివీ

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై పనిభారం పూర్తిగా పడింది. వారానికి 30 నుంచి 36 పీరియడ్ల సామర్థ్యాన్ని పెంచింది. దీంతోపాటు ఏక మాధ్యమంగా (తెలుగు/ఇంగ్లీషు) చేశారు. అసలు రాష్ట్రంలో ఏ మాధ్యమం అమలవుతుందనే దానిపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. తరగతిగదిలో పిల్లల సంఖ్యను 40 నుంచి 60కి పెంచేశారు. ప్రతి ఉన్నత పాఠశాలల్లో 3 నుంచి 6 సబ్జెక్టు టీచర్లను రద్దు చేశారు. అటు ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, కొన్ని పోస్టులను రద్దు చేశారు. 1, 2 తరగతులకు వృత్తి స్థాయి టీచర్లతో బోధన లేదు. విద్యాహక్కు చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాల్లో 1, 2 తరగతుల ప్రవేశాలకు 25శాతం సీట్లను కేటాయించడంతో, చాలా మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్‌కు వెళ్లిపోయారు. దీంతో అక్కడ ప్రాథమిక పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారింది. అంతటితో ఆగకుండా జీవో నంబరు-117, జీవో-128 ప్రభుత్వం జారీజేసి, ఉపాధ్యాయుల సర్దుబాటుకు ఉపక్రమించి, దూర ప్రాంతాలకు వారిని పంపింది. ఈ చర్యలతో 53వేల పోస్టులు కాస్తా కుదించుకుపోయాయి. ఉన్న వాటిలోనూ సర్దుబాటు చేస్తూ, నూతన పోస్టులు లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఈ చర్యలతోనే ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోయేలా ప్రభుత్వం వ్యవహరించింది. ఇదే విధానం కొనసాగితే మరో మూడేళ్ల వరకు రాష్ట్రంలో డీఎస్సీ ప్రకటన రావడం కష్టతరం అవుతుందని ఉపాధ్యాయ, నిరుద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నాడు ఎన్నికల సమయంలో ఏటా పది వేలతో జంబో డీఎస్సీ ఇస్తానని జగన్ నిరుద్యోగులకు హామీ ఇచ్చి...తీరా అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లల్లో ఒక్క డీఎస్సీ ఇవ్వకపోడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి జంబో డీఎస్సీ ప్రకటనకు ఆదేశించాలని, లేకుంటే నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుతో కలసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బీజేపీ ఆశలు హుళక్కే

(మొదటిపేజీ తరువాయి)

పడే ఓట్లు 38.14 శాతం నుంచి 40 శాతానికి, అంటే 1.86 శాతం పెరుగుతాయని, బీజేపీకి పడే ఓట్లు 36.35 శాతం నుంచి 34 శాతానికి, అంటే 2.35 శాతం తగ్గుతుందని పేర్కొంది. జేడీఎస్ కూడా 1.3 శాతం మేరకు ఓట్లను కోల్పోయే అవకాశం ఉన్నట్లు తెలిపింది. చిన్న పార్టీలు, స్వతంత్రులు ఏడు స్థానాలను దక్కించుకోవచ్చునని అంచనా వేసినట్లు పేర్కొంది. వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీల నుంచి కాంగ్రెస్ గరిష్ఠ మద్దతు పొందుతుందని ఈ సర్వే అంచనా వేసింది. ఒక్కలిగ కులస్థుల్లో 50 శాతం మంది జేడీఎస్‌ను బలపరిచే అవకాశం ఉందని, వీరిలో 38 శాతం మంది కాంగ్రెస్‌కు, 10 శాతం మంది బీజేపీకి మద్దతిచ్చే అవకాశం ఉందని వివరించింది.

ప్రపంచ సంఘీభావం అవసరం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను, ఇతర ప్రపంచ దేశాల ప్రజలను కోవిడ్ మహమ్మారి నుంచి కాపాడుకోవడానికి కావాల్సిన దాంట్లో 5 శాతం వాక్సిన్లను తయారు చేసుకుందని అన్నారు. ఒకవేళ ఈ ఆంక్షలే లేకపోతే ఏమీ చేయగలిగేదో అని అన్నారు. ఈ ప్రపంచంలో ఎన్నో పోరులు ఉన్నాయని, అవసరాలు, కొరతల గురించి తెలుసునని, కానీ ఎటువంటి భయం లేకుండా తాను చెప్పేదేమిటంటే సంఘీభావం అనేది ఒక అత్యంత ఆప్యాయతతో కూడిన ప్రజల భావన అని తెలిపారు. దాన్ని పుచ్చుకునేవారు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటారని అన్నారు. ఎందుకంటే అది వాళ్ల అవసరమని, కానీ దాన్ని అందించేవాడు ఒక మనిషిగా ఎంతో ఎత్తుకు ఎదుగుతాడని, ఒక మనిషిగా, ఒక వనితగా అత్యున్నత దశను చేరుకుంటాడని చెప్పారు. మన మధ్య ఎంతో భౌగోళిక దూరం ఉన్నప్పటికీ మాకు అవసరం ఉన్నప్పుడు మీరు మా పక్షాన నిలబడినందుకు మీకు మా ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. మనం ప్రతి ఒక్కరి కోసం ఒక న్యాయవంతమైన ప్రపంచ నిర్మాణంలో కలిసి నడుస్తామని ఆశిస్తున్నట్లు ఆమె చెప్పారు.

మీ ఆప్యాయతను ఎప్పటికీ మరువలేను

25 సంవత్సరాల కంటే ముందు తాను మొట్టమొదటిసారి భారతదేశానికి వచ్చినప్పుడు మీరందరూ నా మీద చూపించిన ఆప్యాయతను ఎప్పటికీ మరవలేనని అన్నారు. తాను వేర్వేరు రాష్ట్రాలను సందర్శించినప్పుడు ప్రజల ఆదరణ లభించిందని, ఒక సామాన్య క్యూబా వనితగా, చే గువేరా కుమార్తెగా ఆప్యాయతను పంచారని తెలిపారు. మొట్ట మొదటిసారిగా కేరళ గుడికి చెందిన ఒక పెద్ద ఏనుగు మీద కూర్చోవడం.

అది అద్భుతమైన 15 నిమిషాలన్నారు. నిజం చెప్పాలంటే, తాను వీలైనంత త్వరగా ఆనాటి మధుర జ్ఞాపకాలను గ్రంథస్తం చేయాలన్నారు. ఎందుకంటే కాలం వాటిలో కొన్నింటిని చెరిపేస్తూ ఉందని, తాను పొందిన ఈ సంఘీభావంతో కూడిన ఆప్యాయతను పదిలపర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని అలైదా గువేరా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ, చే గువేరా సేవలను గుర్తుచేసుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, సూర్యచంద్రులు ఉన్నంత వరకు చే గువేరా పేరు ప్రపంచంలో శాశ్వతంగా ఉంటుందన్నారు. తన వీరోచిత పోరాటంతో ప్రపంచంలోనే విప్లవ వీరుడుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా మాట్లాడారు.

ఎన్నికల సమగ్రతపై
నేడు ఈసీ అంతర్జాతీయ సదస్సు



న్యూదిల్లీ: సాంకేతికత వినియోగం, ఎన్నికల సమగ్రతపై సోమవారం నుంచి రెండవ అంతర్జాతీయ సదస్సును ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్వహిస్తోంది. రెండు రోజులు జరిగే సదస్సును సీఈసీ రాజీవ్ కుమార్ ప్రారంభిస్తారని ఈసీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 17 దేశాలు/ఎన్నికల సంఘాలకు చెందిన 43 మంది ప్రతినిధులు హాజరవుతారని, అంతర్జాతీయ సంఘాల ఆరుగురు ప్రతినిధులు కూడా పాల్గొనున్నట్లు ప్రకటన పేర్కొంది. 2021, డిసెంబరులో వర్చువల్‌గా కోహర్ట్ 'ప్రజాస్వామ్యంపై సదస్సును'ను ఎన్నికల కమిషన్ నిర్వహించింది. తొలి అంతర్జాతీయ సదస్సు 2022 నవంబరులో జరిగింది.

వలసబాట.. గ్రామాలకు గ్రామాలు ఖాళీ

కర్నూలు జిల్లాలో రచ్చకట్టల వెలవెల

బిక్కుబిక్కు మంటున్న వృద్ధులు, చిన్నారులు

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు/కోసిగి: అతివృష్టి, అనావృష్టితో కర్నూలు జిల్లాలో వలసలు పెరిగాయి. ప్రత్యేకించి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కరువు రక్కసి కాపురం చేస్తోంది. కరువుతో కూలీలు, కౌలు రైతులు బతుకుతెరువు కోసం వలస బాట పట్టారు. దీంతో గ్రామాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. వీధులు, రచ్చకట్టలు వెలవెలపోతున్నాయి. జిల్లాలోని మంత్రాలయం, ఆలూరు, కోడుమూరు, పత్తికొండ, డోన్ నియోజకవర్గాల నుండి పెద్దఎత్తున కూలీలు గుంటూరు, ప్రకాశం, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, కేరళకు తరలిపోతున్నారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరు మాసాల్లో కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు నకిలీ పత్తి విత్తనాలు రైతును నట్టేట ముంచాయి. పెట్టుబడులు సైతం రాక అన్నదాతలు అప్పుల పాలయ్యారు. బ్రతకడమే కష్టంగా మారింది. చేసేది లేక రైతులు వలసబాట పట్టారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలంలో చింతకుంట, పల్లెపాడు, నేలకోసిగి, వందనగల్లు, కోల్‌మాన్‌పేట, దుద్ది, కోసిగి, సజ్జల గుండాల, ఎం.బాపురం, ఐరన్‌గల్లు, చిరతనగల్లు, కామన్‌దొడ్డి, కడిదొడ్డి గ్రామాలతోపాటు నదీతీర ప్రాంతాలు ఆగసనూరు, సాతనూరు గ్రామాల నుండి వలసలు పెరిగాయి. మండలంలో మొత్తం జనాభా 90 వేలుకాగా 40 వేల మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కౌతాళం మండలంలో 3 వేల నుండి 4వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. మదిరి, పొదలకుంట గ్రామాలు 80శాతం ఖాళీ అయ్యాయి. పెద్దకడుబూరు, మంత్రాలయాలకు సంబంధించి కనీసం ఒక్కో మండలం నుండి 500 నుండి 800 కుటుంబాలు వలస పోయారు. పత్తికొండ, ఆలూరు, నియోజకవర్గాలలోని తుగ్గలి, కృష్ణగిరి, దేవనకొండ, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి మండలాలకు సంబంధించి ప్రతి గ్రామంలో వందల కుటుంబాల కూలీలు బతుకుతెరువు కోసం వెళ్లారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పత్తి, మిరప, వరి కోతలు ఉండటంతో ఆ ప్రాంతానికి పనుల కోసం పోయారు. కూలీలు 75 నుండి 90 రోజుల పాటు అక్కడే ఉంటారు. గ్రామంలో ఇళ్ల వద్ద చిన్నారులు, వృద్ధులు ఉంటున్నారు. ప్రతినెలా వచ్చే పింఛను, రేషన్ బియ్యంతో పిల్లలను చూసుకుంటూ పెద్దలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వలసలు పెరగడంతో రైతులను ఆదుకోవాలని రైతుసంఘాల నాయకులు ఎన్నిసార్లు డిమాండ్ చేసినా పాలకులు పెడచెవిన పెట్టారు. ప్రతి ఏడాది వలసలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని రైతు, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు చేస్తున్న ఆందోళనలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల వంటి సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడంతో పాటు వలసల శాశ్వత నివారణ కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వలసల నివారణ కోసం ప్రభుత్వం శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని సీపీఐ, ఏపీ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ప్రభుత్వం, అధికారులపై వత్తిడి తెచ్చినా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి వలసలు నివారించవలసిన అవసరం ఉందని ప్రజలు, ప్రజాసంఘాలు నాయకులు కోరుతున్నారు.

నేడు పరకాల పట్టాభి పదో వర్ధంతి

విశాలాంధ్రకు కుటుంబ సభ్యుల చిరుకానుక

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ జర్నలిస్టు అమరజీవి పరకాల పట్టాభిరామారావు పదో వర్ధంతి సోమవారం. విశాలాంధ్ర దినపత్రికకు సంపాదక విభాగంలో, వివిధ హోదాల్లో పట్టాభి సేవలు అందించారు. విశాలాంధ్ర ఆవిర్భావం నుంచి ఐదున్నర దశాబ్దాలకుపైగా ఆయన సంపాదకవర్గ విభాగంలో పనిచేసి ఎందరినో జర్నలిస్టులుగా తీర్చిదిద్దారు. అనేక పుస్తకాలను రచించారు. కమ్యూనిస్టుగా సేవలు అందించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టాభి పదో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమా రుడు పరకాల సూర్య మోహన్, కుమార్తెలు పరకాల ఉషాదేవి, పరకాల సంధ్యాదేవి విశాలాంధ్రకు చిరు కానుకగా వెయ్యి నూటపదహారు రూపాయలు అందజేశారు. వారికి విశాలాంధ్ర విజ్ఞానసమితి కార్యదర్శి జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ పి. హరినాథరెడ్డి, ఎడిటర్ ఆర్వీ రామారావ్ ధన్యవాదాలు తెలిపారు. విశాలాంధ్రకు పట్టాభి అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ముగిసిన పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ముగిసింది. 997 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు జరిగింది. మొత్తం 6,100 పోస్టులకుగాను 5లక్షల 3వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రిలిమినరీ పరీక్షకు 5లక్షల 3వేల 487 మంది దరఖాస్తు చేసుకోగా, 4,58,219 మంది (91శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. మరో 45,268 మంది హాజరవ్వలేదు. ప్రిలిమినరీ ఆన్సర్ కీను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంచుతారు. ఈసందర్భంగా పరీక్షా కేంద్రాలవద్ద అభ్యర్థులు బారులు తీరారు. చివరి నిమిషం వరకు పరుగులతో పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. కొన్ని చోట్ల పరీక్షా కేంద్రాలు మారాయి. దీంతో పోలీసు కానిస్టేబుళ్ల సహకారంతో ద్విచక్ర వాహనాలపై వారిని సంబంధిత పరీక్షా కేంద్రం వరకు పంపి సహకరించారు. పోలీస్ కానిస్టేబుల్స్ (సివిల్)-మెన్ అండ్ ఉమెన్, ఎస్‌సీటీ పోలీస్ కానిస్టేబుల్ (ఏపీఎస్‌పీ)-మెన్ విభాగాల్లో ఖాళీల భర్తీకిగాను ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్‌శాఖ గతేడాది నవంబరు 28న ప్రకటన జారీ జేసింది. పరీక్షల విజయవంతానికిగాను సహకరించిన పోలీసు అధికారులు, స్థానిక పోలీసులు, కళాశాలల సిబ్బంది, జేఎన్టీయూ- కాకినాడ విభాగం సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ ర్యాలీ జయప్రదం చేయాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 26న రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి అధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. ఆదివారం గన్నవరం సీపీఐ కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పంట ఉత్పత్తులపై 50 శాతం పెంచి గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు, పేదలకు రుణపరిమితి పెంచాలనీ, అత్యంత కీలకమైన విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని, అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులకు బీమా పథకం వర్తింపు చేయాలని, విద్యుత్ మీటర్ల బిగింపును విరమించుకోవాలనీ, సమగ్ర భూసరేలో తప్పుల తడకలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వమే సరిచేయాలని కోరారు. వ్యవసాయ ఉద్యమ సమయంలో రైతులపై బీజేపీ పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో చేపట్టబోయే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి జమల్లయ్య, జిల్లా అధ్యక్షుడు వెలగపూడి ఆజాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కమాల ఉమామహే శ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎం యల్లమందా రావు, గన్నవరం సీపీఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కార్యవర్గ సభ్యుడు బండారు లక్ష్మయ్య, కట్టవరపు విజయ రావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: దేశాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడుకునేందుకు అందరూ భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విజయ నగరంలోని అమర్‌భవన్‌లో ఆదివారం సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన జరిగింది. ఈశ్వరయ్య మాట్లా డుతూ కేంద్రంలోని ఎన్డీయేకు నేతృత్వంవహిస్తున్న బీజేపీ కుల, మత, ప్రాంతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నదని తెలిపారు. దేశాన్ని పూర్తిగా నాశనం చేసిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేడు అనేక పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు భారతదేశాన్ని హిందూ దేశంగా చూడాలని మోదీ చూస్తున్నారన్నారు. ఎనిమిదిన్నర సంవత్సరాల కాలంలో లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి కామేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజలను మోసం చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడు తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం అన్యాయం అన్నారు. అనేక మంది ప్రాణాలు త్యాగాలు చేసిన పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు అలమండ ఆనందరావు, బుగత అశోక్, కార్యవర్గ సభ్యులు బుగత పావని, బాయి రమణమ్మ, అరుణ కుమారి కోట అప్పన్న, మద్ది కృష్ణ, ఎస్ రంగరాజు, నాగభూషణం, పి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ యాత్ర అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు: జవహర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లోకేశ్ పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మాజీ మంత్రి, టీడీపీ నేత కేఎస్ జవహర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్ర ప్రారంభం కాకముందే సీఎం జగన్, వైసీపీ నేతలు ఎలా అడ్డుకోవాలనే దిశగా ప్రణాళికలు రచిస్తున్నారన్నారు. లోకేశ్ యాత్ర ద్వారా రాష్ట్రంలో రాజకీయం ఏవిధంగా మారబోతోందనే ఆందోళనపడుతున్నారనీ, అధికారులు బూజుపట్టిన చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ జీవో నెంబర్-1ను అడ్డం పెట్టుకుని లోకేశ్ పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తున్నారు. వైసీపీ నాయకులు, అధికారులు భయపడుతున్నారనడానికి ఇదే నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. లోకేశ్ పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున నీరాజనం పలకనున్నారన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు

పదోన్నతి కల్పించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శులకు పదోన్నతి విధానాన్ని కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. సమస్యలపై విజయవాడ గొల్లపూడి జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో సమావేశం నిర్వహించారు. దీనికి గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ పనితీరును వివరిస్తూ 15వేల మంది వెల్ఫేర్ ఉద్యోగుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. జాబ్‌చార్టు, పదోన్నతి విధానం కల్పించాలనే అంశాలపై చర్చించారు. నోషనల్ ఇంక్రిమెంట్ తదితర సమస్యలపై అధికారులకు తెలియజేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయంలోని అన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలిచ్చారు. సమస్యలపై ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు కార్యదర్శుల కోసం నూతనంగా రాష్ట్ర వెల్ఫేర్ ఐక్య కమిటీ కన్వీనర్‌గా ఎం.శ్రీపతిని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా గుడి నాగరాజు, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శిగా అంకంరావు ఎన్నికయ్యారు. వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీపతి, మహబూబ్ బాషా, మల్లేష్, నరసింహులు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం: రావులపల్లి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నేడు ప్రైవేటుపరం చేసి ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెండేళ్ల నుంచి సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజాసంఘాల అధ్వర్యంలో నిరసన ఉద్యమాలు చేస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ఆయన విమర్శించారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఏఐటీయూసీ, సీపీఐ అధ్వర్యంలో రెవెన్యూ డివిజన్లలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని, 30న విశాఖలో లక్షలాదిమంది కార్మికులతో ధర్నాలు, బహిరంగ సభలు జరిపి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని తెలిపారు. లక్షల మంది ప్రజానీకం ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణగౌడ్, ఏఐటీయూసీ నాయకులు వీర, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలపై పడి బాలుడి మృతి

విశాలాంధ్ర - బాపట్ల: సరదాగా ఆడుతూ పాడుతూ చెట్లు ఎక్కి ఆనందంతో ఉన్న ఇద్దరు చిన్నారుల్లో ఒకరిని విద్యుత్ తీగలు బలి తీసుకోగా, మరోకరిని ఆసుపత్రి పాలుచేసిన ఘటన జిల్లాలోని కొరిశపాడు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కొరిశపాడు మండలం దైవాల రావూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన గడ్డం బుజ్జి కుమారుడు అఖిల్, అతని స్నేహితుడితో కలిసి సాయిబాబా గుడి దగ్గర ఉన్న బాదం చెట్టు ఎక్కి కాయలు కోసుకుం టున్నారు. దీంతో వీరు ఎక్కిన కొమ్మ కరెంట్ తీగలకు తగలటంతో ఒక్కసారిగా విద్యుత్తు షాకు గురై అఖిల్ అక్కడిక్కడే మృతిచెందగా, అతని స్నేహితుడికి గాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని ఆసుపత్రికి తరలిం చారు. చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

దళిత యువకుడిపై దాడి

విశాలాంధ్ర-ఆస్పరి: కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో దారుణ ఘటన వెలుగు చూసింది. మండల పరిధిలోని తంగరడోన గ్రామంలో ఆలయం దగ్గర ఆటో ఆపుకుని కూర్చుంటావా అంటూ కులం పేరుతో దూషిస్తూ దళిత యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసి, ఆస్పత్రి పాలు చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. తంగరడోన గ్రామానికి చెందిన మాదిగ సంజన్న ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి సుమారు 8:30 సమయంలో చింతల మునిస్వామి దేవాలయం దగ్గర తన స్నేహితులతో కలిసి ఆటోలో కూర్చుని మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన చెందిన బోయ చిన్న మహానంది పూటుగా మద్యం సేవించి 'దళితులైన మీరు మా దేవాలయం దగ్గరే ఆటో ఆపుకొని కూర్చుంటారా, ఈ గుడి దగ్గర కూర్చుంటే, గుడి దగ్గరకు వస్తే చంపుతా' అని హెచ్చరించాడు. దీన్ని సంజన్న ప్రశ్నించడంతో కోపోద్రిక్తుడైన బోయ చిన్న మహానంది వెనుక వైపు నుంచి వచ్చి సిమెంట్ రోడ్డుపై పడేసి రాయితో ఎడమ చేయి మణికట్టు మీద, వీపు పైన దాడి చేశాడు. అంతటితో ఆగకుండా చెవి దగ్గర రాయితో గాయం చేయడంతో, తీవ్ర రక్తస్రావమైంది. దీంతో లేవలేని పరిస్థితిలో ఉన్న సంజన్నను మునెప్ప, చిన్న ఈరన్న హుటాహుటిన ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి : ఎమ్మార్పీఎస్ డిమాండ్

దళిత యువకుడు సంజన్నపై దాడి చేసిన బోయ చిన్న మహానందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, సంజన్న, నెట్టేకల్లు, యల్లప్ప, హనుమంతు డిమాండ్ చేశారు. ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందు తున్న బాధిత యువకుడిని ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె జయప్రదం చేయాలి: ఏఐబీఈఏ

విశాలాంధ్ర-విజయవాడ: జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని, బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జనవరి 30, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, విజయవాడ రీజియన్ ప్రప్రథమ ద్వైవార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ సత్యనారాయణ పురంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఏపీ యూనియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కాళే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. బ్యాంకులను ప్రైవేటీకరించి, రుణాలు ఎగ్గొట్టిన వారినే బ్యాంకులకు అధిపతులను చేసేందుకు కుట్ర జరుగుతోందని రాంబాబు ఆరోపించారు. దేశంలోని ప్రస్తుత ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థితి, ఉద్యోగుల పరిస్థితి వివరించారు. నవంబరు 1, 2022తో 11వ వేతన సవరణ అంశం ముగిసిందన్నారు. 12వ వేతన సవరణకు సంబంధించిన ద్వైపాక్షిక చర్చల ప్రారంభానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో ఐదు రోజుల పనిదినాలు అంగీకరిం చాలన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెన్షన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. 2010 తరువాత ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉగాది, శ్రీరామనవమి, వినాయకచవితి పండుగలకు సెలవు ప్రకటించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై ఏఐబీఈఏ తీసుకుంటున్న చర్యల గురించి విపులంగా వివరించారు. ఈ నెల 30, 31 తేదీలలో సమ్మె ప్రకటన వెలువడిన తరువాత ప్రభుత్వం తరపు నుంచి 12వ వేతన సవరణ ద్వైపాక్షిక చర్చలకు నోటీసు వెలువడడం తమ విజయమే అన్నారు.

ఈ సందర్భంగా బ్యాంకుల సర్వీస్ నియమ నిబంధనలు, విధివిధానాలను వివరిస్తూ రూపొం దించిన పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ బ్యాంకుల ప్రైవేటీకరణను నిలువరించేందుకు మరిన్ని పోరా టాలు చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. విజయవాడ రీజియనల్ సెక్రెటరీ నీరుకొండ సుబ్బారావు అతిథులకు, సభ్యులకు స్వాగతం పలికారు. జిల్లా నలుమూల నుంచి యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు హాజరయ్యారు. ఏఐయూబీఈఏ ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ ఎన్. శంకర్, విజయవాడ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ నరసింహమూర్తి, విజయవాడ రీజనల్ హెడ్ యూవీ రజనీ కాంతరావు, విజయవాడ డిప్యూటీ రీజియనల్ హెడ్ రమేశ్, ఏఐయూబీఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ రీజినల్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రీజినల్ సెక్రటరీగా ఎన్.సుబ్బారావు, డిప్యూటీ సెక్రటరీలుగా జి.శ్రీనివా సరావు, ఎం.అరవిందదేవి, అసిస్టెంట్ సెక్రటరీగా ముజఫర్ అలి, కోశాధికారిగా బాబూరావు ఉన్నారు.

సీఎస్ఎస్ నిధులు ఇప్పించండి: హరీశ్

నిర్మలా సీతారామన్‌కు మరోసారి లేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్: 2014-15లో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం (సీఎస్ఎస్)కింద తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధులు రూ.495 కోట్లు పొరబాటున ఏపీకి జమ చేశారని, వాటిని తిరిగి ఇప్పించాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కేంద్రాన్ని మరోసారి కోరారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు ఇప్పించాలని ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు మరోసారి లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మొదటి సంవత్సరంలో (2014-15) కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జనాభా ప్రాతిపదికన విభజించారని, అయినా, పొరపాటున మొత్తం సీఎస్ఎస్ నిధులను ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేయడం వల్ల తెలంగాణ నష్టపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకువెళ్లిందని తెలిపారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా రూ.495 కోట్లను తెలంగాణకు ఇంకా సర్దుబాటు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై అనేకసార్లు కేంద్రానికి ఉత్తరాలు రాశామని చెప్పారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్‌కు పొరబాటున విడుదల చేసిన రూ.495 కోట్ల మొత్తాన్ని తిరిగి తెలంగాణకు విడుదల చేసేలా కృషి చేయాలని నిర్మలా సీతారామన్ ను కోరారు. వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకొని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని లేఖలో విన్నవించారు.

మంచిని మోసం చేస్తేనే

ఓ నాటకాన్నిపోలిన లోకంలో.......
మేకప్ లేకుండా ఏ పాత్ర రక్తికట్టదు.

వేదిక ఎక్కకుండావేషం వేయకుండా
కాళ్లకు, కళ్ళకి అల్లికలల్లిమంచిని మోసం చేస్తేనే

బతుకన్న నిజమొక్కటే జీవిస్తూమనిషిని రాణిస్తుంది
మనసును గెలిపిస్తుంది.

సిహెచ్.నారాయణరావు, 9704437247

పుస్తకావిష్కరణ సభ

సోమేపల్లి వేంకటసుబ్బయ్య నానీల సంపుటి 'నాగలికి నా నమస్కారం' పుస్తక ఆవిష్కరణ సభ 29.01.23 ఆదివారం ఉదయం 10గంటలకు ఎస్.ఎం. సుభాని, ఎన్.వి. సత్యనారాయణ (నానా)ల నిర్వహణలో కొరటాల మీటింగ్ హాల్, 2/7 బ్రాడీపేట, గుంటూరు నందు జరుగును. ఈ సభకు అధ్యక్షులుగా సారస్వత కళానిధి వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత్రి చిల్లర భవానీదేవి, సమీక్షకులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, రమ్యభారతి సాహిత్యపత్రిక ఎడిటర్ చలపాక ప్రకాష్ పాల్గొంటారని గుంటూరు జిల్లా రచయితల సంఘం తెలియజేస్తున్నది.

రాజాం రచయితల వేదిక 96వ సమావేశం

రాజాం రచయితల వేదిక 96వ సమావేశం ఈ నెల 29 ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో మూడడ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుంది. ఆ సభలో పొదిలాపు శ్రీనివాస్ 'భూషణం కథలు' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, 9885758123

సాహితి

మంచి పుస్తకం

ఆఖరి లంకె

ఆర్వీ రామారావ్

ఉద్యమాలను వ్యక్తులు నిర్మించరు అన్నది నిజమే అయినా ఆ ఉద్యమాలలో పాల్గొన్న వ్యక్తుల కార్యకలాపాలు చరిత్ర నిర్మాణంలో భాగం అవుతాయి. కందిమళ్ల ప్రతాప రెడ్డి జీవితం సుదీర్ఘ కాలం ప్రజోద్యమాలతో, యువజనో ద్యమాలతో, ప్రజా నాట్య మండలితో, కమ్యూనిస్టు పార్టీతో పెనవేసుకు పోయింది. ఆయనకు సంబంధం ఉన్న అంశాల చరిత్ర ఇతరత్రా అపారంగా అందుబాటులో ఉండవచ్చు. కానీ వ్యక్తిగతంగా ఆయన అనుభవాలు కూడా చరిత్ర నిర్మాణానికి ఉపకరణాలే.

కందిమళ్ల ప్రతాపరెడ్డి అడపా దడపా రాజకీయ, సాంస్కృతిక అంశాలపై రాసిన వ్యాస సంపుటి ఈ "మరవ కూడని మన చరిత్ర". కమ్యూనిస్టు పార్టీతో ప్రతాపరెడ్డికి సుదీర్ఘకాలంగా సంబంధం ఉంది. చాలాకాలం రాష్ట్ర నాయకత్వంలో భాగస్వామి. తెలంగాణ సాయుధ పోరాటంలో చిన్ననాటే అంటే యుక్తవయసైనా రాకముందే సంబంధం ఉన్న వారాయన. సాహిత్య రంగం లోనూ ఆయన కృషి తగినంతగా ఉంది. ప్రజానాట్య మండలి పునర్నిర్మాణం తరవాత ఆయన ఆ కార్యకలాపాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించారు. ఇలా వివిధ రంగాలలో ఆయన అనుభవాలు, జ్ఞాపకాలు చాలానే ఉన్నాయి. ఈ అనుభవాల్లో కొన్ని ఇదివరకే గ్రంథస్థమైనాయి. మిగిలిన వ్యాసాలను కూర్చి ఈ గ్రంథం సిద్ధం చేశారు.

ఏడు దశాబ్దాల కన్నా మునుపటి చరిత్రను, ఆ తరవాత వివిధ రంగాల్లో ఆయన క్రియాశీల పాత్ర గురించి రికార్డు చేయడం ఈ దశలో అవసరం. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం ఉన్న వారి, దాన్ని ప్రత్యక్షంగా చూసిన వారి తరం క్రమంగా వెళ్లిపోతోంది. ఆ వరసలో ప్రతాప రెడ్డి లాంటివారు అతి కొద్ది మందే మిగిలి ఉండొచ్చు. సాయుధ పోరాట స్మృతులు ఆయన జ్ఞాపకాల పేటికలో ఇంకా భద్రంగానే ఉన్నాయి. ప్రత్యక్షంగా ఆ పోరాటంలో పాల్గొన్న వారిలో చాలా మంది ఆ అనుభవాలను గ్రంథస్థం చేశారు. ఆ వరసలో ప్రతాప రెడ్డి బహుశః ఆఖరి లంకె కావచ్చు.

తెలంగాణ సాయుధ పోరాటం, ఆంధ్ర ప్రదేశ్ అవతరణ, ప్రత్యేక తెలంగాణ వాదం, ప్రజానాట్య మండలి, కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాలు, అవరోధాలు, కమ్యూనిస్టుల ఐక్యత ఆవశ్యకత, దానికి ఎదురవుతున్న అడ్డంకులు, యువజ నోద్యమాలు మొదలైన అనేక అంశాల మీద ఆయన భిన్న సందర్భాలలో రాసిన వ్యాస గుచ్ఛం ఇది. ఈ సకల అంశాల్లో ఆయన ఏం చెప్పినా అది తెలుగు వారి, వారి సంస్కృతి, భాష, సాహిత్యం, పోరాటాల చుట్టే తిరుగుతుంది. ఈ దారి పొడవునా ప్రతాపరెడ్డి పాదముద్రలూ కనిపిస్తాయి. ఆ నడకలో తప్పటడుగులు, తప్పుటడుగులు ఉన్న వాస్తవాన్ని కప్పి పుచ్చడానికి ప్రయత్నం చేయకపోవడం ఆయన చిత్త శుద్ధికి తార్కాణం.

తెలుగు వారిది ఒకే భాష, ఒకే సంస్కృతి అయినా ఈ రెండింటిలోనూ ప్రాంతాలనుబట్టి స్వల్పమైన తేడాలు ఉండొచ్చు. రాజకీయంగా తెలుగు వారు అన్ని వేళలా ఒకే ఛత్రం కింద లేనందువల్ల ఈ తేడాలు కనిపించవచ్చు. యాసలోనూ వ్యత్యాసాలు ఉండవచ్చు. కానీ అంతర్లీనంగా ఏక సూత్రతా ఉంది. తెలుగు వారు చాలా సందర్భాలలో కలిసి ఉన్నారు. మరెన్నో సందర్భాలలో విడిగానూ ఉన్నారు. ఈ తరానికి తెలుగు వారి రాజకీయ అస్తిత్వం గురించి అవగాహన బొత్తిగా లేకపోవడం చూస్తూనే ఉన్నాం. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఒకప్పుడు మద్రాసు రాష్ట్రంలో భాగమని, ఇప్పుడు తెలంగాణ అంటున్న ప్రాంతం 225 ఏళ్ల పాటు నిజాం నవాబుల ఏలుబడిలో ఉండేదని, దాన్ని హైదరాబాద్ సంస్థానం అనే వారనీ అందులోనే కన్నడం, మరాఠీ ప్రాంతాలు కూడా ఉండేవని ఈ తరంలో చాలా మందికి తెలియకపోవచ్చు. ఉమ్మడి మద్రాసు నుంచి విడిపోయి ఏర్పడింది ఆంధ్ర రాష్ట్రమే తప్ప ఆంధ్రప్రదేశ్ కాదని, పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఆంధ్రప్రదేశ ఏర్పాటు కోసం కాదని తెలిసిన వారు దుర్భిణీ వేసి చూస్తే తప్ప కనిపించడం లేదు. ఇలాంటి వారికి 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గురించి లీల గానూ, రెండు దశాబ్దాల కిందటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గురించి స్పష్టాస్పష్టంగా తెలిసి ఉండవచ్చు. 1972 నాటి ప్రత్యేకాంధ్ర ఉద్యమానికీ తెలంగాణ ఏర్పడబోయే ముందు సమైక్యాంధ్ర ఉద్యమం మధ్య తేడా తెలిసిన వారిని అయితే వెతికి పట్టుకోవలసిందే.

తెలుగు వారిది సుదీర్ఘమైన చరిత్రే. అయితే తెలుగు వారు రాజకీయంగా భిన్న పాలనలో ఉన్న ఊసు, ఆ తరవాత మళ్లీ ఐక్యంగా ఉన్న వాస్తవం తెలిసిన వారు బహు కొద్ది మందే. కాకతీయుల కాలంలో తెలుగు వారు సమైక్యంగా ఉన్నారు. మళ్లీ ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరవాతే సమైక్యంగా ఉన్నారు. ప్రతాప రెడ్డి రాసిన "మరవ కూడని మన చరిత్ర" ఈ లోటు పూడ్చడానికి ఉపకరిస్తుంది.



తెలుగు వారి సమైక్యతకు, విభజనకు గల కారణాలను ఈ గ్రంథంలో కూలంకషంగా వివరించడమే కాక విలీనం నుంచే విభజన వాదం ఎలా పాదుకుందో సాధికారికంగా తెలియజేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలలో మొదటిది తెలుగు వారిదేనని గొప్పగా చెప్పుకుంటాం. భాష మాత్రమే ప్రజలను కలిపి ఉంచే అంశం కాదని తెలంగాణ, కోస్తా ఆంధ్ర ప్రాంతాలలో కొనసాగిన ఉద్యమాలు నిరూపించాయి. ఏ భాష మాట్లాడే వారైనా ఒకే రాజకీయ ఛత్రం కింద ఉండాలని, ఉండి తీరుతారని అనుకోవడం కుదరని పని అని నిరూపించింది కూడా తెలుగువారే.

తెలంగాణా సాయుధ పోరాటం కేవలం తెలంగాణా ప్రాంత ప్రజలదేనన్న భ్రమ చాలా మందిలో ఈ నాటికీ ఉంది. భౌగోళికంగా చూస్తే ఆ మాట నిజమే కావచ్చు. కానీ అది సత్యదూరం. కోస్తా ప్రాంతం, కోస్తా ప్రాంతానికి చెందిన రచయితలు, కళాకారులు, రాజకీయవాదులు సాయుధ పోరాటానికి నిరుపమానమైన సహకారం అందించారన్న విషయం ఇప్పటి వారికి తెలియకుండా పోయే లోటు పూడ్చడానికి ఈ పుస్తకం ఉపయోగపడ్తుంది.

ప్రత్యేక తెలంగాణ వాదం ఎందుకు తలెత్తిందో ఆయన వివరించిన తీరుకు కారణం 1969నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని, ఆ తరవాత ఈ ఉద్యమానికి విరుగుడా అన్నట్టు కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 1972లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం కొనసాగడం ప్రతాపరెడ్డి కళ్లారా చూసిన పరిణామాలే. 1972నాటి ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి కారణాలు ఈ గ్రంథంలో ఛాయా మాత్రంగా కనిపిస్తాయి. 1969నాటి పోరాట సమయంలో ప్రతాపరెడ్డి సమైక్యవాదే. కానీ రెండు దశాబ్దాల కింద మొదలైన ప్రత్యేక తెలంగాణా వాదాన్ని సమర్థించడానికి కారణాలూ ఆయన వివరించారు. ఇది కమ్యూనిస్టు పార్టీలో వైఖరిలో వచ్చిన మార్పు మాత్రమే కాదు. పరిస్థితులు వైఖరి మారడానికి దారి తీశాయి. దాదాపు రెండు దశాబ్దాల కింద మళ్లీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తలెత్తినప్పుడు 1972లో ప్రత్యేక ఆంధ్ర కావాలని ఉద్యమించిన వారు రెండో విడత సమైక్యాంధ్ర అని ఎందుకు వాదించారో అర్థం కావాలంటే ఇలాంటి పుస్తకాలు చదవాల్సిందే. మంచి పుస్తకం ఆలోచనలను తట్టిలేపుతుంది. తరచి చూడ వలసిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. "మరవ కూడని మన చరిత్ర" ఈ పనే చేస్తుంది.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తే తెలంగాణ ప్రజలు మాత్రం నిజాం నిరంకుశ పాలనలోనే మగ్గిపోయారు. కర్కశమైన నిజాం నిరంకుశత్వాన్ని అంతమొందించడానికి ఇక్కడి ప్రజలు ఆయుధాలు చేపట్టక తప్పలేదు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే అపురూపమైంది. ఒక వేపు సాయుధ పోరాటం కొనసాగుతుంటే కేంద్రంలోని నెహ్రూ ప్రభుత్వం 1947 నవంబర్ 29న నిజాంతో యథా ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం ఏడాది తరవాత పరిస్థితి బేరీజు వేసి మళ్లీ ఒప్పందాన్ని పొడిగించాలనుకున్నారు. ఆ పరిస్థితి దాపురించకుండా నివారించింది తెలంగాణ సాయుధ పోరాటమే. ఆ ప్రమాదాన్ని ఈ గ్రంథ రచయిత ఎలా వివరించారో గమనించండి: "తెలంగాణ ప్రజా పోరాటం లేకపోతే ఏం జరిగేది? యథా తథ ఒప్పందం కొనసాగి భారత దేశ నడిబొడ్డున 'ఆజాద్ హైదరాబాద్'ఉండేదా? లేక ముస్లిం మతోన్మాదుల ఒత్తిడికి లొంగి నిజాం నవాబు హైదరాబాద్ ను పాకిస్తాన్ లో విలీనం చేసే వాడా? అలా చేస్తే భారత దేశ గుండెల మీద పాకిస్తాన్ భూభాగం ఉండేది! ఆ ప్రమాదాలను తెలంగాణ సాయుధ పోరాటం తొలగించింది. నాలుగు వేల మంది అమరవీరుల, వీర వనితల త్యాగాలతో ఆ ప్రమాదాన్ని నివారించింది" అంటారు ప్రతాపరెడ్డి. మొదటి సార్వత్రిక ఎన్నికలలో నెహ్రూ కన్నా తెలంగాణ సాయుధ సమరసేనాని రావి నారాయణ రెడ్డికి ఎక్కువ ఓట్లు వచ్చాయని ఇప్పుడు అందరికీ తెలుసు. కానీ సుంకం అచ్చాలు కు సైతం నెహ్రూ కన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయి అన్న వాస్తవం ప్రతాప రెడ్డి లాంటి వారు తప్ప ఎవరు చెప్పగలరు?

తెలంగాణ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగితే దాన్ని ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిందని ప్రచారం చేసే వారు బయలుదేరారు. ఆ పోరాటంతో ఏ మాత్రం సంబంధం లేని వారు హైదరాబాద్ నిజాం ఉక్కు పిడికిలి నుంచి విముక్తమైన సెప్టెంబర్ 17న అట్టహాసంగా చిందులు వేస్తుంటారు. సర్దార్ పటేల్ పంపిన సేనలే నిజాం పాలన పీడను విరగడ చేశాయని వీరంగం వేస్తుంటారు. ఈ సైనిక చర్యకు ముద్దు పేరే పోలీసు ఆక్షన్. పటేల్ పంపిన సేనలు చేసిన పనల్లా సాయుధ పోరాటం తాకిడికి ఊపిరి సలపకుండా ఉన్న నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ను ఒక్క తోపు తోయడమే. కానీ అవే సేనలు కమ్యూనిస్టుల మీద ఎలా విరుచుకు పడ్డాయో చెప్పకుండా దాచేసే కుట్రలను ఈ గ్రంథం విప్పి చెప్పకపోయినా ఆ అవసరాన్ని గుర్తు చేస్తుంది.

వామపక్ష ఉద్యమం బలహీన పడ్తుండడం ఈ గ్రంథ రచయితను చికాకు పెడ్తోంది. నిజానికి కమ్యూనిస్టులు కాని వారి అభిప్రాయం కూడా అదే. వామపక్ష రాజకీయాల ప్రయోజనాన్ని కమ్యూనిస్టు వ్యతిరేకులూ గుర్తిస్తూనే ఉన్నారు. మొదటి నుంచీ ప్రభుత్వాలు అంతో ఇంతో పురోగామి విధానాలు అనుసరించడానికి వామపక్ష పార్టీలు నిరంతరం కొనసాగించిన పోరాటాలే దీనికి కారణం. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణకు కమ్యూనిస్ట్ పార్టీ పోరాటాలు ఎలా ఉపయోగపడ్డాయో ప్రతాపరెడ్డి సంక్షిప్తంగానైనా వివరించారు.

నాల్గవ అధ్యాయం వామపక్ష ఉద్యమాన్ని విమర్శనాత్మకంగా వివరించ డానికి ఉపయోగపడ్తుంది. వామపక్షాలు బలహీన పడ్తున్నాయని అనుకునే వారికి ఈ అధ్యాయం కచ్చితంగా నూతనోత్సాహం కలిగిస్తుంది. కమ్యూనిస్టుల ఐక్యతకు ఉన్న అవరోధాలను చర్చించి ప్రధానంగా రెండు వామపక్ష పార్టీలు విలీనం కావడానికి ఉన్న అవకాశాలను విడమర్చి కనిపించే మార్గాన్ని కూడా ప్రతాప రెడ్డి పొడకట్టించారు. ఆయన సూచన అమలు అవుతుందా లేదా అన్నది చర్చనీయాంశం కాదు. అయితే "కమ్యూనిస్టుల ఐక్యత-సమస్యలు-నేటి కర్తవ్యం"అన్న వ్యాసంలో కమ్యూనిస్టుల ఐక్యతకు ఆయన ఆర్తి ఎంత తీవ్రమైందో ద్యోతకం అవుతోంది. ఇలాంటి అభిప్రాయం, కమ్యూనిస్టులు బలపడాలని, ఏకం కావాలని కోరుకునే వారు ఈ పార్టీలతో సంబంధం ఉన్న వారే కాదు. వామపక్షాల అభిమానులూ కాకపోవచ్చు. కానీ కమ్యూనిస్టుల ఐక్యతను జనం కోరుకుంటున్నారన్నది మాత్రం వాస్తవం. ఈ ఐక్యత సాధ్యాసాధ్యాల గురించి సవివరంగా చర్చ జరగవలసిందే. అప్పుడే ఐక్యత దిశగా అడుగేయడం సాధ్యం. ఈ ఐక్యత జనం ఆకాంక్ష అని వామపక్ష పార్టీలు గ్రహించి చిత్త శుద్ధితో కృషి చేస్తే అసాధ్యం ఏమీ కాదు అన్న భావన ప్రతాప రెడ్డి వ్యాసాల్లో అంతర్లీనంగా కనిపిస్తూ ఉంటుంది.

ప్రజానాట్య మండలి పునరుద్ధరణలో ప్రతాప రెడ్డి పాత్ర గణనీయమైంది. అభ్యుదయ రచయితల సంఘానికి ఆయన అందించిన సహకారమూ తక్కువేం కాదు. ప్రజానాట్యమండలి కార్యకలాపాల గురించి ఆయన కొన్ని అధ్యాయాల్లో ప్రస్తావించినా అందులో తన పాత్ర గురించి ఎక్కడా విశేషంగా ప్రస్తావించకపోవడం ఆయన వినయానికి, అణకువకు నిదర్శనం. ఏ ఉద్యమమైనా ప్రజల మద్దతుతోనే పురోగమిస్తుంది అన్న విశ్వాసం ఉన్న వారు కాబట్టి తన పాత్రను పనిగట్టుకుని తగ్గించి చూపించినట్టున్నారు.

కొన్ని పరిమళాలు

నలుగురితో మాట్లాడుకోవటం
పక్షుల కిలకిల రావాలు వినటం
వనాలు పచ్చని తోరణాలు కట్టటం
మొగ్గలువీడి గాలితో పలకరించటం
గాలిచేరి హృదయాలు వికశించటం

ఇసుక తెన్నెల్లో కూర్చుని
ఎగసే కెరటాల్ని చూడటంచుట్టూ ఊగే దృశ్యాల్ని
కళ్ళల్లో వొంపుకోవటం
ఆస్వాదించటం
నాలో సంచరించే కొన్ని పరిమళాలు.

వెన్నెల కాంతుల్ని తొడుక్కోవటం
వర్షధారల్ని నింపుకోవటం

ఆశగా ఆకాశం వంకా
హరివిల్లు వంకా
కొంచెం కొత్తగా చూపుల్ని ఆరేసుకోపటం
నాకింకా అలానే
ఆనందాలు పొద్దు పొడుస్తున్నాయి.

దేహమంతా పరవశంతో
అనేక దీపాలుగా వెలుగుతుంది.

చిన్ని కొండలనూ ఎక్కి
దృశ్యాల్ని నింపుకుంటాను.

పిల్లకాల్వలో గెడ్డలలో
చేపలు పట్టుకుంటాను
కొన్ని పరిమళాల్ని
నాతో అంటిపెట్టుకుంటాను.

గవిడి శ్రీనివాస్, 7019278368

భారత్-రష్యా సాంస్కృతిక సేతువు
కామ్రేడ్ కేశవగోపాల్

అతని పేరులోనే ఓ విచిత్రముంది. అసలు పేరు చెన్నకేశవ. అతని మిత్రుని పేరు గోపాల్. కలిపి తన పేరు కేశవగోపాల్‌గా మార్చుకున్నాడు. కానీ రష్యాలో అతనిని అందరూ 'చెన్నా' అని పిలిచేవారు ముద్దుగా. రష్యాలో దాదాపు ఏడు సంవత్సరాల పాటు దుబాసీగా పనిచేసిన కేశవగోపాల్‌ని గురించి ఆసక్తికరమైన అంశాలు చాలానే ఉన్నాయి. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 20 వ మహాసభలో బ్రేఝ్నెవ్ చేసిన ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ఘనత కేశవగోపాల్‌ది.

మాస్కోలో ఉండగా అక్కడి సమాజ విజ్ఞానశాస్త్ర సంస్థలో విద్యార్థిగా చేరి లెనిన్ భాషా శైలిపై ఓ సిద్ధాంత వ్యాసం రష్యన్ భాషలో సమర్పించాడు కేశవగోపాల్. రష్యన్ భాషలో ఆయన స్నాతకోత్తర డిప్లొమా పొందాడు. అంతేకాదు, అతనికి బాంగ్లా, జర్మన్, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషలు తెలుసు. బాంగ్లా, కన్నడ సినిమాల పట్ల ఆయనకు అమితమైన ఆసక్తి. మరి అతని అభిరుచులు కూడా అమితమే. డ్రాయింగ్, పెయింటింగ్, నాటకరచన, దర్శకత్వం, కవితలు, కథలు రాయడం, సినీ విమర్శ ఫోటోగ్రఫీ, అనువాదం, చదరంగం, సంగీతం, సినిమాలకు మాటలు రాయడం, వీడియోగ్రఫి, మేకప్, జర్నలిజం, ప్రెస్‌లో పనిచేయడం లాంటి అనేక అభిరుచులు అతనివి. అతని కథ 'తూలిక' రష్యను భాషలో అచ్చయింది. రష్యాలో అధ్యాపకులు, విద్యార్థుల మధ్య సంబంధాల్ని గురించి తెలియజేస్తూ, అక్కడ తాను విద్యార్థిగా ఉన్న ఓ క్లాసులో ఓ రష్యన్ ప్రొఫెసర్ ఓ విషయమై నాకు క్షమాపణ చెప్పింది అని అక్కడి విద్యా వ్యవస్థను ప్రశంసిస్తాడు కేశవగోపాల్. లెనిన్‌గ్రాద్ (గ్రాద్ అంటే రష్యనులో నగరం అని అర్థం) (గ్రాడ్ అనడం తప్పు. రష్యను భాషలో ట, డలు లేవు.) కు చెందిన తెలుగు ప్రొఫెసర్ మూరి గూరొన్‌తో కేశవగోపాల్‌కి పరిచయం ఉండేది. ఇక కేశవగోపాల్ వ్యక్తిగత విషయానికి వస్తే, అతను అప్పటి కడపజిల్లా రాయచోటిలో 1941 లో జన్మించాడు. నాన్న రామయ్య, అమ్మ పేరు సుబ్బమ్మ. వ్యవసాయం చేసి బతికేవారు. సర్వీస్ కమిషన్ పరీక్షలో నెగ్గి 1959-75 మధ్య ట్రెజరీ ఆఫీసులో అకౌంట్స్ చూసే ఉద్యోగిగా పని చేశాడు కేశవగోపాల్.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ముక్కవాసన వచ్చే రేషన్ బియ్యం తినలేక కష్టపడేవారు కేశవగోపాల్ కుటుంబీకులు. అమ్మ పొలం కాడికి పోయి 'నిమ్మటాయ' దుంప గడ్డలు తెచ్చి కొడుక్కి తినిపించేది. కేశవగోపాల్ వివాహం చేసుకోలేదు. భారత కమ్యూనిస్టు పార్టీలో అతను కార్డు కలిగిన సభ్యునిగా కొన్నేళ్లపాటు ఉన్నాడు. 1975 లో రష్యా వెళ్లిన అతను 1982 లో తిరిగి వచ్చాడు. తిరిగివచ్చిన తరువాత చెన్నై నుంచి వెలువడే 'సోవియట్ భూమి' తెలుగు పత్రిక కోసం ఆ పత్రిక నిలిచిపోయేంతవరకు రచయితగా, అనువాదకునిగా పనిచేశాడు. 1982 లో కేశవగోపాల్‌కు ఓ ప్రమాదం జరిగింది. ఓ స్కూటర్‌లో వెనుక కూర్చున్న ఇతని కాలు ఒక మలుపు వద్ద చక్రంలోకి దిగడంతో కుడికాలికి పెద్ద దెబ్బ తగిలింది. ప్రస్తుతం తెలుగు ద్వారా రష్యన్ భాష నేర్చుకునేందుకు వీలుగా ఓ పుస్తకం రాస్తున్నాడు కేశవగోపాల్. ఐక్యరాజ్యసమితిలో ఒక అధికార భాష అయిన రష్యన్ భాష బాగా తెలిసిన కేశవగోపాల్ లాంటి వాళ్లను మనం ప్రోత్సహించాలి. ఇంగ్లీషు ఆధిక్యాన్ని తగ్గించే దిశగా దేశంలో చర్యలుండాలి. దాన్ని ఐచ్ఛికం చేయాలి. వలసవాదుల భాష అయిన ఆంగ్ల పెత్తనం మనం సహించరాదు. ఇతర ప్రపంచ భాషల్ని మన విద్యాలయాల్లో ఐచ్ఛికంగా బోధించాలి. ఇదే కేశవగోపాల్ ఆశయం. వియత్నామ్‌లో వలసవాదులైన ఫ్రెంచ్ వాళ్ల భాష బోధనా భాష కాదు.

ప్రస్తుతం సహచరుడు కేశవగోపాల్ రాయచోటిలోని తన సోదరుని కూతురు ఇంట్లో ఉంటున్నాడు. మాస్కోలో 'చెన్నా' గా గడిపిన జీవితాన్ని నెమరువేసుకుంటూ రెండు దేశాల మధ్య సాంస్కృతిక సేతువై నిలుస్తూ...

డా॥ తక్కోలు మాచిరెడ్డి, సెల్: 9666626546

చిలకమర్తి వారి జాతీయోద్యమ కవిత్వం

డా॥పి.వి.సుబ్బారావు, సెల్: 9849177594

చిలకమర్తి లక్ష్మీనరసింహం తొలి జాతీయోద్యమ కవిగా, ప్రముఖ నాటకకర్తగా, నవలా రచయితగా, సంఘ సంస్కరణవాదిగా, సుప్రసిద్ధ పాత్రికేయుడిగా 19 వ శతాబ్ది చివర, 20 వ శతాబ్ది ఆరంభంలో తెలుగు సాహిత్యాభివృద్ధికి గణనీయమైన కృషి చేసిన గొప్ప రచయిత చిలకమర్తి. చిలకమర్తి వారు 1867 సెప్టెంబరు 26 వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు రత్నమ్మ, వెంకయ్య. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం వీరవాసరంలో , ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం నరసాపురంలో సాగింది. రాజమండ్రి కళాశాల నుండి పట్టభద్రుడయ్యాడు. కొన్నాళ్లు తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఒక్క సంవత్సరం పాటు సరస్వతీ పత్రిక సంపాదకుడిగా చేశాడు. ఆ తర్వాత ఉద్యోగాన్ని విరమించి 1899 లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి 9 సంవత్సరాలు నిర్వహించి, తర్వాత దాన్ని వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చాడు. ఆయన 30 సంవత్సరాల వయసులో రేచీకటి వ్యాధికి గురైనా, ఎంతో శ్రమించి కంటిచూపు అవరోధాన్ని అధిగమించి ఎన్నో రచనలు చేశాడు.

బ్రిటీషు వారి కుటిల తంత్రాల్లో చిక్కి భారతీయులు పారతంత్ర్యంలో అలమటిస్తున్న స్థితిలో మహాకవి గురజాడ "దేశమంటే మట్టి కాదోయ్/ దేశమంటే మనుజులోయ్" దేశానికి దేశభక్తికి నిర్వచనాలు చెప్పి ప్రజలను ప్రబోధించాడు. ఆచార్య రాయప్రోలు వారు దేశీయుల్లో దేశాభిమానం రేకెత్తించే విధంగా "ఏ దేశమేగినా/ ఎందు కాలిడినా/ పొగడరా నీతల్లి/ భూమి భారతిని/ అని దేశీయుల్లో మాతృ దేశాభిమానాన్ని ప్రదీప్తం చేశాడు. జాతీయోద్యమం తొలిదశలో బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా 1907 వ సంవత్సరం ఏప్రియల్ నెలలో రాజమండ్రిలో మూడురోజులు పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన ఉపన్యాసాలను చిలకమర్తి వారు అనువదించాడు. అప్పటి బ్రిటీషు ప్రభుత్వం వారి దురాగతాలను, దోపిడీ విధానాన్ని, జాతీయోద్యమ స్ఫోరకంగా, చైతన్య ప్రేరకంగా ఆశువుగా చివరి రోజు సభలో "భరతఖండంబు చక్కని పాడియావు/ హిందువులు లేగదూడలై యేడ్చుచుండ/ తెల్లవారను గడసరి గొల్లవారు/ పితుకుచున్నారు మూతులు బిగియబట్టి అని చెప్పాడు. చిలకమర్తి వారి పలుకులు కమ్మని కలకండ పలుకుల్లా ప్రజల నాలుకలపై నాట్యమాడాయి.

భారతమాతను పాడిఆవుతో,
భారతీయ సంపదను పాడితో,
హిందువులను లేగదూడలతో,
వారనుభవించే కష్ట నిష్ఠూరాలను
లేగదూడల ఏడ్పుతో వర్ణించాడు.
తెల్లవారిని గడసరి గొల్లవారనడం
వల్ల ప్రభుత్వం వారి నిర్ధాక్షిణ్య
కాఠిన్యాన్ని, సంపదను
కొల్లగొట్టడాన్ని సూచించాడు.
'మూతులు బిగియబట్టి' అని చెప్పడం
వల్ల సమకాలీన స్వాతంత్ర్యరహితమైన
దుస్థితిని వ్యక్తపరచాడు. అప్పట్లో చిలకమర్తి
వారి పద్యం దేశీయుల ప్రజాభిమానాన్ని పొందింది.
దేశాభిమాన రహితులైన కొందరు పండితులు ఆ పద్యంలో
చిలకమర్తి బ్రిటీషు ప్రభుత్వంలో తెల్లవారిని గొల్లవారితో పోల్చి
అభిశంసించాడని చెప్పి చిలకమర్తి వారికి జైలు శిక్ష విధించేట్లు
చేశారు. దేశాభిమానులైన కొందరు పండితులు ఆ పాదానికి
చక్కని విరుపుతో 'తెల్లవారిన వెంటనే గొల్లవారు' అనే అర్థం
చెప్పి జైలు నుండి విడిపించారు.

బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ పర్యటనకు పూర్వమే 1905 డిసెంబరు 15 వ తేదీన 'కృష్ణా పత్రిక' లో "ది క్రై ఆఫ్ మదరిండియా" (హిందూ దేశపు మొర) అనే గీతాన్ని అజ్ఞాత కవి ప్రచురించాడు. చిలకమర్తి పద్యానికి మూలం ఆ గేయంలోని "దూడ నోరుగొట్టె ద్రోహులు గొల్లలు" అనే అజ్ఞాత కవి గేయమన్న ఆచార్య సుబ్బారెడ్డి అభిప్రాయం సమంజసమైందే. కొందరు పండితులు చిలకమర్తి వారి పద్యాన్ని చెన్నాప్రెగడ భానుమూర్తిదని చెప్పడం సరైందికాదు. బ్రిటీషు ప్రభుత్వం 1909 లో 'పంజాబ్ కేసరి లాలాలజపతిరాయ్‌ని నిర్బంధించిన సందర్భంలో చిలకమర్తి వారు బ్రిటీషు ప్రభుత్వాన్ని అభిశంసిస్తూ "భరతఖండంబె యొక గొప్ప బందిఖాన/ అందులోన్ను ఖయిదీలు హిందుజనులు/ ఒక్కగది నుండి మార్చి వేరొక్కగదిని/ బెల్టుటేగాక చెఱయంచ వేరెగలదె" అన్నాడు. ఈ పద్యంలో చిలకమర్తివారి వేదన గమనార్హం. భారతీయులు బానిసత్వంలో ఎంతగా బాధలుపడేవారో, పారతంత్ర్య కుతంత్రాల్లో ఎంతగా కుమిలిపోయేవారో "భరతఖండంబెయొక గొప్ప బందెఖాన" అనే పాదం వల్ల స్పష్టమవుతుంది. ఖయిదీలు హిందు జనులనడంలో ఎట్టి నిర్భర కష్ట నిష్ఠూరాలను అనుభవించేవారో అవగత మవుతుంది. చిలకమర్తి వారు మరో పద్యంలో స్వాతంత్ర్య భావనా పరులైన వారికి "చెఱసాలల్ పృథు చంద్రశాలెయగున్/ చేదోయి గీతించునయ్యర దండల్ విరిదండలయ్యెడన్ హేయంబైన చోడంబలే/ పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్చిన్ పట్టు సెల్లాలగున్/ స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తిన్ గొల్చునవ్వానికిన్"

స్వాతంత్ర్య భావనా కాంక్షితులు దేశాభిమాన దీక్షితులైన వారికి చెఱసాలలు చంద్రశాలలుగా, అరిదండలు విరిదండలుగా, చోడంబలి పరమాన్నంగా, మోటు కంబళులు పట్టు సెల్లాలుగా భాసిస్తాయని చెప్పడం కారాగార భీతులను దేశాభిమాన దీక్షితులుగా ప్రబోధించడం కోసమే. చిలకమర్తి వారిననుసరించి గేయకవి సార్వభౌముడైన గరిమెళ్ల సత్యనారాయణ "మాకొద్దీ తెల్లదొరతనము"- అనే గేయం రాశాడు. మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి ఆనాటి సంఘంలోని అస్పృశ్యతను అధిక్షేపంగా చేసికొని "అంటరాని వారెవరు? మా వెంట రానివారే" అని ప్రజల హృదయాల్లో నిబిడీకృతంగా ఉన్న వీరత్వాన్ని దేశాభిమాన తత్వాన్ని రెచ్చగొట్టి స్వాతంత్ర్యోద్యమోన్ముఖులుగా చేశారు.

కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి "వీరగంధము/ తెచ్చినారము/ వీరులెవ్వరో చెప్పుడీ"- అంటూ ప్రశ్నించి ప్రజల మనసుల్లో వీరత్వాన్ని, దేశభక్తిని ప్రదీప్తం చేశాడు. రాయప్రోలు, విశ్వనాథ, జాషువా, తుమ్మల, దువ్వూరి వంటి కవులు పారతంత్ర్యం భేదకంగా, జాతీయోద్యమ స్ఫోరకంగా, స్వాతంత్ర్యం సాధకంగా కవితలు రాశారు. స్వాతంత్ర్య సాధనకు కవితల ద్వారా తమ వంతు కృషి చేశారు.

భారత్ జీ20 అధ్యక్షత

వాతావరణ మార్పు... ఆవిష్కరణలపై చర్చ

గుజరాత్‌లో మూడు రోజుల సమావేశం

న్యూఢిల్లీ: భారతదేశం జీ20 అధ్యక్షతలో భాగంగా ఆదివారం నుంచి గుజరాత్‌లోని గాంధీనగర్ నగరంలో జరుగుతున్న బిజినెస్ 20 (బి20) ప్రారంభ సమావేశం వాతావరణ మార్పు, ఆవిష్కరణ, ప్రపంచ డిజిటల్ సహకారం, స్థితిస్థాపకమైన ప్రపంచ విలువ గొలుసుల వంటి అంశాలపై చర్చిస్తుందని అధికారులు ఇక్కడ తెలిపారు. మూడు రోజుల సమావేశంలో భాగంగా ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ మ్యూజియం దండి కుటీర్‌కు ప్రతినిధులను తీసుకువెళ తామని గుజరాత్ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి మోనా ఖంధర్ విలేకరులకు తెలిపారు. బి20 ఇండియా 2023 చర్చ బాధ్యతాయుతమైన, వేగవంతమైన, వినూత్నమైన, స్థిరమైన, సమానమైన వ్యాపారాలకు సంక్షిప్త రూపమైన 'రైజ్' ఇతివృత్తంతో జరుగుతుందని ఆమె చెప్పారు. సోమవారం గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్‌లో బి20 సమావేశానికి సంబంధించిన ప్లీనరీ సెషన్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, భారత దేశం జీ20 షెర్పా అమితాబ్ కాంత్ పాల్గొంటారని అధికారి వివరించారు. 'వాతావరణ మార్పు, స్థిరమైన ఆర్థిక అభివృద్ధి, ఆర్థిక చేరిక, స్థితిస్థాపక ప్రపంచ విలువ గొలుసుల వంటి అంశాలపై ప్లీనరీ సమావేశంలో చర్చలు జరుగుతాయి. ఈ చర్చలు గుజరాత్ ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రమైన, పచ్చదనం, సమ్మిళిత ఆర్థిక వృద్ధి పరివర్తన కార్యక్రమాలను చర్చిస్తారని ఖందర్ తెలిపారు. ఈ సమావేశంలో అనేక మంది అంతర్జాతీయ, భారతీయ పరిశ్రమల ప్రముఖులు పాల్గొంటారు. జీ20, అతిథి దేశాలతో పాటు బహుపాక్షిక సంస్థలు, విద్యాసంస్థల నుంచి 250 మంది అంతర్జాతీయ ప్రతినిధులతో సహా కనీసం 600 మంది ప్రతినిధులు, భారతీయ పరిశ్రమ నుంచి 250-300 మంది ప్రతినిధులు పాల్గొంటారని ఆమె తెలిపారు. కార్యక్రమం మూడవ, చివరి రోజైన మంగళవారం, ప్రభుత్వం గిఫ్ట్ సిటీ (గుజరాత్ ఇంటర్నే షనల్ ఫైనాన్స్ టెక్-సిటీ), అదాలజ్ స్టెప్‌వెల్‌ల సంద ర్శనలతో పాటు యోగా కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల కమిషనర్ రాహుల్ గుప్తా తెలిపారు. 2023ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించినందున, గుజరాత్ సమావేశాల సందర్భంగా ప్రతినిధులకు భోజన సమయంలో మిల్లెట్ వస్తువులను అందజేస్తుందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి ఆదివారం ప్రతినిధులకు ఇచ్చే విందు ఈ సందర్భంగా వారు మిల్లెట్లతో చేసిన ఆహారం సహా అనేక గుజరాతీ రుచికరమైన వంటకాలను ఆస్వాదించనున్నట్లు గుప్తా తెలిపారు. భారతదేశం జీ20 అధ్యక్షతలో భాగంగా గుజరాత్‌లో జరిగే 15 సమావేశాలలో ఇది మొదటిది. గాంధీనగర్‌లో ఇలాంటి 10 సమావేశాలు, అహ్మదాబాద్‌లో రెండు, సూరత్, కచ్, ఏక్తానగర్‌లో ఒక్కొక్కటి చొప్పున సమావేశాలు నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. బి20 అనేది అధికారిక జీ20 చర్చా వేదిక. ఇది అధికారికంగా జీ20 అధ్యక్షతకు తన తుది సిఫార్సులను తెలియజేస్తుందని ఖందర్ చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) బి20 ఇండియాకు సెక్రటేరియట్, బి20 ఇండియాకు టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ఛైర్మన్ అని ఖంధర్ తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం తన సంప్రదాయం, వారసత్వం, సంస్కృతి, వినూత్న ప్రాజెక్టులు, పెట్టుబడి సామర్థ్యం, అవకాశాలను సందర్శించే ప్రతినిధులకు ప్రదర్శిస్తుందని ఆమె చెప్పారు. కాగా, యునెస్కో ప్రపంచ వారసత్వ నగరమైన అహ్మదాబాద్ అర్బన్ 20 (యు20) సైకిల్‌ను నిర్వహిస్తుంది. అహ్మదాబాద్ ఫిబ్రవరి 9-10 తేదీలలో సిటీ షెర్పాస్ ప్రారంభ సమావేశం, పట్టణ అభివృద్ధి సమస్యలపై నేపథ్య చర్చలు సహా వివిధ కార్యక్రమాలకు ఆతిథ్యం ఇస్తుంది. జులై 2023లో యు20 మేయర్ల సదస్సుతో ముగుస్తుందని ఒక ప్రకటన పేర్కొంది. జీ20 దేశాలు, సి40 (నగరాల వాతావరణ నాయకత్వ సమూహం), యూసీఎల్‌జీ (యునైటెడ్ సిటీస్, స్థానిక ప్రభుత్వాలు) సభ్య నగరాలు, పరిశీలకుల నగరాల నుంచి మేయర్‌లు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని భావిస్తున్నారు. జీ20 అనేది అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి ప్రధాన ఫోరమ్. ఇది అన్ని ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక సమస్యలపై అంతర్జాతీయ నిర్మాణ, పాలనను రూపొందించడంలో, బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. డిసెంబరు 1, 2022 నుంచి నవంబర్ 30, 2023 వరకు భారతదేశం జీ20 అధ్యక్ష పదవిని కలిగి ఉంది.

విద్యలో మోదీ ప్రభుత్వం విఫలం: ఖర్గే

న్యూఢిల్లీ: దేశంలో విద్యా ప్రమాణాలను పాటించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం విమర్శించారు. తాజా అధ్యయనం ప్రకారం విద్యార్థులలో పఠనశక్తి లోపించాయని వెల్లడైందన్నారు. విద్యకు సంబంధించి మోదీ ప్రభుత్వ ప్రగతి నివేదికలో 'ఎఫ్' (ఫెయిల్) ఉందని ఖర్గే వ్యాఖ్యానించారు. 'విద్యపై మోదీ ప్రభుత్వ ప్రగతి నివేదికలో ఎఫ్ వచ్చింది అంటే ఫెయిల్! మూడో తరగతి విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలను సైతం చదవలేని పరిస్థితి దేశంలో ఉంది. పఠన సామర్థ్యం కోల్పోయిన విద్యార్థులు 2014లో 25శాతంగా ఉంటే 2022లో 20శాతం మంది ఉన్నారు. ఐదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠ్యపుస్తకాలను చదవలేకపోతున్నారు. ఇలాంటివారు 2014లో 50శాతం ఉంటే 2022లో 42.8శాతంగా ఉన్నారు' అని ఖర్గే ట్వీట్‌చేశారు. గ్రామీణ పాఠశాలల్లో మూడో తరగతి విద్యార్థుల్లో పఠన సామర్థ్యం ఆందోళనకరస్థాయికి తగ్గిందని అధ్యయనం పేర్కొన్నట్లు గుర్తుచేశారు. రెండో తరగతి పాఠపుస్తకాలను చదవగల విద్యార్థులు 20.5శాతమే ఉన్నట్లు తెలిపారు. పఠన సామర్థ్యం ఏడు పాయింట్లు తగ్గిందని (2018 నుంచి 2022 వరకు) అధ్యయనం పేర్కొనడాన్ని ఖర్గే ప్రస్తావించారు.

బడ్జెట్‌పై చర్చకు 29న కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 1న కేంద్రబడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. ఈ క్రమంలో 29వ తేదీన మంత్రివర్గ సమావేశాన్ని ప్రధాని మోదీ నిర్వహించనున్నారు. కీలకాంశాలను మంత్రులతో చర్చిస్తారు.బడ్జెట్ సమావేశాలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలనూ మోదీ జారీ చేయనున్నట్లు తెలిసింది.తమ ప్రభుత్వ చివరి బడ్జెట్ కావడంతో మోదీ దీనికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. తదుపరి సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వెంటనే అందులోని ప్రజారంజక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంత్రులంతా నిర్విరామంగా శ్రమించాలని మోదీ ఆదేశాలివ్వనున్నట్లు సమాచారం. అలాగే జీ20 అధ్యక్షత బాధ్యతలు చేపట్టడం, జీ20 సదస్సు క్రమంలో దేశవ్యాప్తంగా 50 ప్రాంతాల్లో 200 కార్యక్రమాలు నిర్వహించడం గురించీ చర్చిస్తారని తెలిసింది.కేబినెట్ మంత్రులు కూడా తమ శాఖల పనితీరుపై ప్రజెంటేషన్లు, నివేదికలు సమర్పించనున్నట్లు సమాచారం. త్వరలోనే జరగనున్న మంత్రివర్గ విస్తరణ-పునర్వ్యవస్తీకరణపైనా చర్చ జరగవచ్చు. ఈ భేటీ తర్వాత కేబినెట్ విస్తరణ ఉంటుందని తెలుస్తోంది.

టీచర్లు, ప్రభుత్వోద్యోగుల
పాత పెన్షన్‌కు 'మహా' సానుకూలం

థానే: ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని మహా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అన్నారు. శనివారం రానున్న శాసన మండలి ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్ర విద్యాశాఖ పాత పెన్షన్ స్కీమ్‌పై అధ్యయనం చేస్తోందని తెలిపారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగులు నిర్వచించిన పెన్షన్ పొందుతారు. దీని కింద, ఒక ఉద్యోగి చివరి జీతంలో 50 శాతం మొత్తాన్ని పెన్షన్‌గా పొందేందుకు అర్హులు. అయితే, 2004 నుంచి అమలులో ఉన్న జాతీయ పెన్షన్ వ్యవస్థ కింద పెన్షన్ మొత్తం కంట్రిబ్యూటరీగా ఉంటుంది. 'ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్, అలాగే నాన్ ఎయిడెడ్ పాఠశాలలు, ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. పాత పెన్షన్ విధానాన్ని విద్యాశాఖ అధ్యయనం చేస్తోంది' అని షిండే చెప్పారు. దావోస్ సమావేశం గురించి ఆయన మాట్లాడుతూ కొన్ని విదేశీ కంపెనీలు నేరుగా పెట్టు బడులు పెట్టే బదులు సంయుక్త భాగస్వామ్యానికే మొగ్గు చూపుతున్నాయని అన్నారు. 'అందుకే దావోస్ సదస్సులో చాలా మంది పారిశ్రామికవేత్తలు భారతదేశానికి చెందినవారు. కానీ అది విదేశీ పెట్టుబడి అవుతుంది' అన్నారాయన. ఇటీవల జరిగిన దావోస్ సదస్సులో పెట్టుబడి ప్రతిపాదనలపై ప్రతిపక్షాలు లేవనెత్తిన ఆరోపణలకు రాష్ట్ర ప్రభుత్వం తన పని ద్వారా సమాధానం చెబుతుందని షిండే తెలిపారు. గత మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం సంతకం చేసిన అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) పరిస్థితిని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

వాస్తవాలను ఎదుర్కోలేకనే...

బీబీసీ డాక్యుమెంటరీ నిషేధంపై విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: బీబీసీ లఘుచిత్రం (డాక్యుమెంటరీ)పై కేంద్రప్రభుత్వ నిషేధాన్ని ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శించారు. నిజాలు బయటకొస్తే ముఖం చెల్లదా అని ఎద్దేవా చేశాయి. వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం లేదా అని నిలదీశాయి. కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, శివసే (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది ప్రభుత్వ చర్యను తప్పుపట్టారు. 2022లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లు, ప్రధాని మోదీపై బీబీసీ డ్యాకుమెంటరీ వివాదస్పదంగా మారింది. దీనిని కేంద్రప్రభుత్వం నిషేధించింది. ఈ చర్యను విపక్షాలు విమర్శించాయి. జైరాం రమేశ్ ఓ వీడియో క్లిప్‌ను పోస్టు చేశారు. 2002 అల్లర్ల తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ సమక్షంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి 'రాజధర్మం' గురించి మాట్లాడటం అందులో ఉంది. ఈ వీడియో ద్వారా కేంద్రప్రభుత్వ చర్యను జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'బీబీసీ డాక్యుమెంటరీ మోదీ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నదని ప్రధాని అనుచరులు చెబుతున్నారు. సెన్సార్‌షిప్‌తో అడ్డుకున్నారు. 2002 అల్లర్ల తర్వాత ఆయన తప్పుకోవాలని అప్పటి ప్రధాని వాజ్‌పేయి భావించారు. అద్వానీ రాజీనామా హెచ్చరిక క్రమంలో వచ్చిన ఒత్తిడితో వెనక్కుతగ్గారు. అయితే నాడు. రాజధర్మం గురించి వాజ్‌పేయి ఆయనకు ఎందుకు గుర్తుచేశారు?' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ట్వీట్‌చేశారు. టీఎంపీ నేత మహువా మొయిత్రా స్పందిస్తూ 'బీబీసీ లఘుచిత్రాన్ని దేశంలో ఎవ్వరూ వీక్షించకుండా మోదీ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని పాలిస్తున్న వారిలో ఇంతటి అభద్రతాభావం ఉండటం సిగ్గుచేటు' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జర్మనీ రచయిత-కవి చార్లెస్ బుకోవిస్కీ మాటలను ఉటంకిస్తూ శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది కేంద్రాన్ని విమర్శించారు. వాస్తవాలను తమ నుంచే కాకుండా ఇతరుల నుంచీ దాచి పెట్టేవారి అస్త్రం సెన్సార్‌షిప్ అని దుయ్యబట్టారు. వాస్తవాలను ఎదుర్కొనే ధైర్యం లేదన్నారు. డాక్యుమెంటరీపై నిషేధం ప్రభావం ఎంతంటూ ప్రశ్నించారు. వీపీఎన్ కాలంలో ఇటువంటి నిషేధాలు ఏ మేరకు ప్రభావం చూపగలవు? ఎంత ఎక్కువగా ఆంక్షలు-నిరసన లేఖలతో గోల చేస్తారో దీనిని చూడాలన్న ఆసక్తి ప్రజల్లో అంతే ఎక్కువగా ఉంటుంద'ని అన్నారు.

11మంది చిన్నారులకు నేడు అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ: పదకొండుమంది చిన్నారులు అసాధారణ విజయాలు సాధించిన నేపథ్యంలో వారిని సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (పీఎంఆర్‌బీపీ) 2023 ప్రదానం చేయనున్నారు. మంగళవారం అవార్డు గ్రహీతలతో ప్రధాని నరేంద్ర మోదీ సంభాషించనున్నారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి జుబిన్ ఇరానీ కూడా పిల్లలతో మాట్లాడతారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి ముంజ్‌పారా మహేంద్రభాయ్ సమక్షంలో వారిని అభినందించనున్నారు. 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అవార్డు గ్రహీతల్లో ఆరుగురు అబ్బాయిలు, ఐదుగురు బాలికలు ఉన్నారు. ప్రతి అవార్డు గ్రహీతకు పతకం, రూ. లక్ష నగదు, సర్టిఫికేట్ ఇస్తారు. పిల్లలు వారి అసాధారణ విజయాలకు కేంద్ర ప్రభుత్వం పీఎంఆర్‌బీపీ అవార్డు ప్రదానం చేస్తుంది. 5-18 సంవత్సరాల వయసు గల పిల్లలకు జాతీయ గుర్తింపునకు అర్హమైన ఆర్ట్ అండ్ కల్చర్, శౌర్యం, ఆవిష్కరణలు, పాండిత్యం, సామాజిక సేవ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డును అందజేస్తారు. ఈ సంవత్సరం, కళ, సంస్కృతి విభాగంలో నాలుగు, శౌర్యంలో1, ఆవిష్కరణలో రెండు, సామాజిక సేవలో రెండు, క్రీడల్లో మూడు అవార్డులు ప్రకటించింది.

మైనర్‌ను వేధించిన వ్యక్తికి దేహశుద్ధి...
పోలీసులకు అప్పగింత

మంగళూరు: మైనర్‌ను వేధించాడనే ఆరోపణతో 35 ఏళ్ల వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసిపోలీసులకు అప్పగించారు. నిందితుడిని ఉల్లాల్ వాసిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. శనివారం కంకనాడిలో ఎనిమిదేళ్ల బాలిక పండ్లు కోస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. సమీపంలో తాపీ పనిలో నిమగ్నమైన నిందితుడు ఆమెను లైంగికంగా వేధించినట్లు సమాచారం. బాలిక కేకలు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న కంకనాడి పోలీసులు విచారణ చేపట్టారు.

2047లో గ్లోబల్ సైన్స్ మోడల్‌గా భారత్
సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ నల్లతంబి కలైసెల్వి

భోపాల్: శాస్త్ర-సాంకేతిక, ఆవిష్కరణల రంగంలో 2047నాటికి ప్రపంచానికి ఆదర్శంగా భారత్ నిలుస్తుందని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నల్లతంబి కలైసెల్వి ఆకాంక్షించారు. 2030 నాటికి టాప్ 3 దేశాల్లో భారత్ ఉంటుందన్నారు. యువ శాస్త్రవేత్తలకు అవార్డుల ప్రదానోత్సవం నిలిచిపోలేదని చెప్పారు. రాబోయే రోజుల్లో సైన్స్ రంగంలో బహుమితీయ వృద్ధిని ప్రజలు చూస్తారన్నారు. సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ కలైసెల్వి. ఈమె శనివారం 8వ భారత అంతర్జాతీయ సైన్స్ ఉత్సవం (ఐఐఎస్ఎఫ్)-22 ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోపాల్‌కు వచ్చిన ఆమె పీటీఐతో మాట్లాడుతూ '2030 టాప్ మూడు దేశాల్లో భారత్ ఉంటుంది. 2047 నాటికి గ్లోబల్ ఎస్‌టీఐ (సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్) రంగంలో ప్రపంచానికి ఆదర్శకంగా నిలుస్తుంది. 2070 నాటికి సైన్స్‌లో భారత్‌కు మించిన శక్తి లేదని ప్రపంచం అంగీకరిస్తుంది. 2070 నాటికి భారత్ ఆ స్థాయికి చేరుకోగలదన్నది నా నమ్మకం' అని కలైసెల్వి అన్నారు. యువ శాస్త్రవేత్తలకు పురస్కారలిచ్చే కార్యక్రమాన్ని సీఎస్ఐఆర్ నిలిపివేసిందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ 'ఏమీ ఆగలేదు. ప్రతిస్థాయిలో యువ శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం లభిస్తోంది. యువ విద్యార్థి శాస్త్రవేత్తలు కార్యక్రమాలనూ ప్రోత్సహిస్తున్నాం. సమీప భవిష్యత్‌లో బహుమితీయ వృద్ధిని చూడబోతున్నాం' అని ఆమె చెప్పారు. సైన్స్‌లో మహిళల పాత్ర గురించి మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగంలో మహిళలు అద్భుతాలు చేయగలరని ప్రభుత్వం కూడా గుర్తించింది. అమృత్‌కాల్‌లో. మహిళా శాస్త్రవేత్తలకు ఎంతో గౌరవం లభించిందని అన్నారు. ఇందుకు తానే ఉదాహరణ అన్నారు. ఐఐఎస్ఎఫ్‌లో కలైసెల్విగా పాల్గొనలేదని సైన్స్ రంగంలో మహిళల ప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. మహిళా సంబంధిత కార్యక్రమాలను సీఎస్ఐఆర్ చేపడుతోందని తెలిపారు. ఎక్కడైనా... ఎందులోనైనా మహిళలు భాగస్వాములు కావడం ప్రత్యేకమని ఐఐఎస్ఎఫ్‌లో మహిళల భాగస్వామ్యం గురించీ కలైసెల్వి అన్నారు. శాస్త్ర-సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని, యువతీ యువకులు ఉత్సాహంగా ముందుకు సాగుతుండటాన్ని బట్టి ఉజ్వల భవితవ్యాన్ని కాంక్షిస్తున్నట్లు తెలిపారు.

మహారాష్ట్ర పోలీసుల మాక్ డ్రిల్ వివాదాస్పదం
ప్రత్యేకించి ఒక వర్గం నినాదాలతో ఆందోళన

చంద్రపూర్: మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లోని ఒక ఆలయంలో ఉగ్రవాదులుగా వేషధారణలో ఉన్న సిబ్బంది ఒక నిర్దిష్ట వర్గానికి సంబంధించిన నినాదాలు చేయడంతో పోలీసుల మాక్ డ్రిల్ వివాదాస్పదమైంది. ఈ అంశంపై న్యాయవాదుల బృందం జిల్లా పోలీసు అధికారులకు మెమోరాండం సమర్పించగా, అటువంటి పొరపాటు పునరావృతం కాకుండా చూస్తామని పోలీసు సూపరింటెండెంట్ రవీంద్రసింగ్ పరదేశి ఆదివారం తెలిపారు. ఇక్కడి ప్రఖ్యాత మహంకాళి ఆలయంలో జనవరి 11న నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఉగ్రవాదుల బృందం ఒక ప్రార్థనా స్థలాన్ని స్వాధీనం చేసుకుని, భద్రతా బలగాలకు పట్టుకునే ముందు భక్తులను బందీలుగా ఉంచిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. 'మాక్ డ్రిల్‌లో ఉగ్రవాదుల పాత్ర పోషించిన సిబ్బంది ప్రత్యేక నినాదాలు చేస్తున్న డ్రిల్ వీడియోలు. ఇది ఒక వర్గాన్ని ప్రతికూల కోణంలో చిత్రీకరిస్తుంది. ఉగ్రవాదులందరూ ఈ వర్గానికి చెందినవారని నమ్మేలా చేస్తుంది' అని ఇక్కడ న్యాయవాదుల సమూహంలో భాగమైన ఫరత్ బేగ్ అన్నారు. 'ఇలాంటి నినాదాలు, చిత్రీకరణకు వ్యతిరేకంగా మేము జిల్లా ఎస్పీ కార్యాలయానికి మెమోరాండం సమర్పించాము. పోలీసుల ఈ చర్య ఆ వర్గం పరువు తీయడమే. సహజంగానే, మాక్ డ్రిల్ రచనను ఎస్పీ, ఇతర సీనియర్ అధికారులు పర్యవేక్షించి ఉండాలి' అని బేగ్ అన్నారు. దీనిపై ఎస్పీ రవీంద్రసింగ్ పరదేశి మాట్లాడుతూ 'అలాంటి పొరపాటు పునరావృతం కాకుండా చూసేందుకు తన శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటుంది' అని అన్నారు. స్థానిక పోలీసులు, ఉగ్రవాద వ్యతిరేక బృందం, ప్రత్యేక పోరాట విభాగం సి-60, ఇతర సిబ్బంది మాక్ డ్రిల్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు.

శ్రద్ధావాకర్ హత్యకేసులో 3వేల పేజీల ఛార్జిషీట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్యకేసులో విచారణ కొలిక్కి వస్తోంది. పోలీసులు ఇప్పటికే కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 3వేల పేజీల డ్రాఫ్ట్ ఛార్జిషీట్‌ను సిద్ధం చేశారు. ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ ఆధారాలు, 100 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. వీటి ఆధారంగా తుది ఛార్జిషీట్‌కు ఓ రూపు ఇవ్వనున్నారు. అంతేకాదు.. అఫ్తాబ్ అంగీకార వాంగ్మూలం, నార్కో పరీక్షల నివేదికను కూడా దీనికి జతచేయనున్నారు. ప్రస్తుతం ఇది న్యాయనిపుణుల సమీక్షలో ఉంది. ఈ నెలాఖరుకు దీనిని న్యాయస్థానంలో దాఖలు చేసే అవకాశాలున్నాయి. మరోవైపు అఫ్తాబ్ నుంచి సేకరించిన సమాచారం మేరకు పోలీసులు దక్షిణ దిల్లీలోని అనేకచోట్ల నుంచి ఇప్పటికే 13 మానవ ఎముకలను స్వాధీనం చేసుకొన్నారు. వాటి డీఎన్ఏలు కూడా శ్రద్ధా తండ్రి డీఎన్ఏతో సరిపోలాయి. అఫ్తాబ్ ఎప్పటి నుంచో తన కుమార్తెను హింసిస్తున్నా.. పోలీసులు చర్యలు తీసుకోలేదని శ్రద్ధా తండ్రి వికాస్ గత వారం వాపోయారు. 2020లో శ్రద్ధా తొలిసారి ఫిర్యాదు చేసినప్పుడే చర్యలు తీసుకొంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. మరో వైపు శ్రద్ధా అదృశ్యంపై తాను మనిక్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించలేదని వికాస్ వెల్లడించారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వాసి డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టారు.

అమ్మాయి వద్దంటే... వద్దనే అర్థం: కేరళ హైకోర్టు



కోచి: మహిళ లేదా బాలికను అనుమతి లేకుండా తాకకూడదని, ఇలాంటి పాఠాలను పాఠశాల స్థాయిలోనే బాలురకు నేర్పాలని కేరళ హైకోర్టు పేర్కొంది. సత్ప్రవర్తన, మర్యాదలకు సంబంధించి అంశాలను ప్రాథమిక స్థాయిలోనే పాఠ్యాంశాల్లో భాగం చేయాలని తెలిపింది. లైంగిక వేధింపుల కేసుల పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. అమ్మాయి వద్దు అని చెప్పిందంటే దానికి అర్థం వద్దు అని పురుషులు స్పష్టంగా అర్థం చేసుకోవాలని జస్టిస్ దేవన్ రామచంద్రన్ తెలిపారు.

ఈరోడ్ ఉపఎన్నికల్లో బీజేపీకి మద్దతు: ఓపీఎస్

చెన్నై: ఈరోడ్ ఉపఎన్నికల్లో తమ పార్టీ తరపు అభ్యర్థి పోటీ చేసే అవకాశం ఉందని ప్రకటించిన కొన్ని గంటల అనంతరం ఏఐఏడీఎంకే రెబల్ నాయకులు ఓ పన్నీర్ సెల్వం గుజరాత్ వెళ్లారు. అక్కడ జరగబోయే తమిళ సంఘం పొంగల్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఒకవేళ ఈరోడ్ ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోటీచేసేటట్లయితే తమ మద్దతు వారికే ఉంటుందని ఆయన తెలిపారు. బీజేపీ జాతీయ పార్టీ కాబట్టి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్‌లో బీజేపీ నాయకులను కలవడంపై ఊహాగానాలు వస్తున్న సమయంలో, తన పర్యటన కేవలం వ్యక్తిగతమనీ, దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవని పేర్కొన్నారు. సీఎం ఎంకే స్టాలిన్ ఈరోడ్ తూర్పు స్థానాన్ని పొత్తుల్లో భాగంగా కాంగ్రెస్‌కు కేటాయించారు. ఈ స్థానంలో ఎమ్మెల్యే తిరుమహన్ ఎవీరా ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏఐఏడీఎంకే అభ్యర్థనను తాము అంగీకరించినట్టు తమిళ మానిల కాంగ్రెస్ చీఫ్ జీకే వాసన్ తెలిపారు. అయితే ఏఐఏడీఎంకే బహిష్కృత నేతలు వీకే శశికళ, టీటీవీ దినకరన్‌ల మద్దతు తనకు ఉంటుందని పన్నీర్ సెల్వం అభిప్రాయపడుతున్నారు. శశికళ, దినకర్‌లను పళనిస్వామి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పార్టీ నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. జులై 2022న పన్నీరు సెల్వంను పార్టీ కో-ఆర్డినేటర్ పదవిలో నుంచి తొలగించగా, పార్టీ సభ్యత్వం కూడా కోల్పోయారు.

అత్యుత్తమంగా దిల్లీ బడులు

న్యూఢిల్లీ: నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలని, తద్వారా విదేశాల నుంచి కూడా విద్యార్థులు చదువుకునేందుకు వస్తారని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. శిక్షణ కోసం విదేశాలకు వెళ్లే ఉపాధ్యాయులను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఈ ప్రక్రియ ఇక్కడితే ఆగదని, మిగిలిన వారిని కూడా విదేశాలకు పంపుతానని, వారికి దిల్లీ ప్రజల మద్దతు, దేశం మద్దతు ఉందని చెప్పారు. 'కొంతమంది దీనిని ఖర్చుగా భావిస్తారు. కానీ అది పెట్టుబడి. మీరు నాలుగు వంతెనలు తక్కువ, నాలుగు రోడ్లు తక్కువ నిర్మించగలరని నేను భావిస్తున్నాను. అయితే మేము మా ఉపాధ్యాయులకు అత్యుత్తమ ప్రదర్శన, శిక్షణను అందించాలి. భవిష్యత్తులో రోడ్లు, వంతెనలు నిర్మించే విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. తమ పరువు తీయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టిన ఆయన, మంచి పనులు చేసే వారిని నిందించే ధోరణి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మన మంచి పనిని చూసి అసూయపడేవాళ్లు ఉన్నారు. పరువు తీయాలని చూస్తున్నారు. కానీ నాకు పార్టీ రాజకీయాలపై ఆసక్తి లేదు. దేశంలో ఎక్కడో ఒకచోట విద్యావ్యవస్థను మెరుగుపర్చాలని బీజేపీ లేదా కాంగ్రెస్ వ్యక్తి కోరుకుంటే, నేను కొన్ని రోజులు మనీశ్ సిసోడియాను వాళ్లకు అప్పజెబుతాను. మేము మొత్తం దేశంలోని విద్యావ్యవస్థను మెరుగుపరచాలనుకుంటున్నాం'అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

నితీశ్‌కు అఖిలేశ్ అభినందన

లక్నో: కుల గణనను ప్రారంభించినందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆదివారం కొనియాడారు. బ్రిటిష్ వారు కూడా 1931లో ఈ చర్య గురించి ఆలోచించారని, దీని ద్వారా మాత్రమే అన్ని కులాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ సభ్యుడు, జనేశ్వర్ మిశ్రా పార్క్ వద్ద యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ, "కుల గణన ఈ రోజు చేయలేదు. 1931లో కుల గణన జరగాలని బ్రిటిష్ వారు భావించారు. రాజ్యాంగంలోని హక్కులు వివిధ కులాలు వర్గాల వారి గణన తెలిసినప్పుడే వారికి ఇవ్వబడతాయి. ఈ చర్యల చేపట్టినందుకు బీహార్ ముఖ్యమంత్రిని నేను అభినందిస్తున్నా' అని పేర్కొన్నారు. ఇలాంటి జనాభా గణనను తమ పార్టీ చాలా కాలంగా డిమాండ్ చేస్తోందని, ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోగా దీనిని ప్రారంభిస్తానని ఎన్నికల ర్యాలీల్లో తాను కూడా హామీ ఇచ్చానని చెప్పారు. తన ఇటీవలి తెలంగాణ పర్యటన గురించి, తెలంగాణ ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు తాను అక్కడికి వెళ్లానని, అనేకమంది ఇతర సీఎంలను కూడా ఆయన ఆహ్వానించారని యాదవ్ చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి రోజులు దగ్గర పడ్డాయన్నారు. "నేను ఈ రోజు చెప్పాలనుకుంటున్నాను, వారి రాష్ట్ర కార్యవర్గం కూర్చున్నప్పుడు, కేవలం 398 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పేదవాడైనా, మరెవరైనా కావచ్చు, ఈరోజు న్యాయాన్ని ఎవరూ ఆశించలేరు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన హక్కులు కూడా హరించుకుపోతున్నాయి. కొంతమంది పారిశ్రామికవేత్తలకు మేలు చేసే నిర్ణయాలను బీజేపీ ఉద్దేశపూర్వకంగా తీసుకుంటోంది' అని పేర్కొన్నారు.

జంట పేలుళ్ల ప్రాంతాన్ని పరిశీలించిన ఎన్ఐఏ

జమ్ము: జంట పేల్లుళ్లు జరిగిన ప్రాంతాన్ని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) బృందం ఆదివారం పరిశీలించిందని అధికారులు తెలిపారు. శనివారం జమ్ము శివారులోని నర్వాల్ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకున్న ఘటనలో తొమ్మిది మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ వరుస పేలుళ్లను మోటారు వాహనాల మరమ్మతుల దుకాణంలో మరమ్మతుల నిమిత్తం ఉంచిన ఎస్‌యూవీ ఉంచబడిన బాంబులను ఆధునీకరణ పేలుడు పదార్థాలను ఉపయోగించి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. అయితే త్వరలో జరిగబోయే గణతంత్ర దినోత్సవం, ప్రస్తుతం జరుగుతున్న కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను దృష్టిలో ఉంచుకుని భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఆదివారం ఉదయం జాతీయ విచారణ ఏజెన్సీ వరుస పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిందని, కేసు విచారణకు ఆమోదం తెలిపిందని అధికారులు వివరిం చారు. ప్రస్తుతం ఆ ప్రాంతం భద్రతా దళాల ఆధీనంలో ఉండగా, పరిశుభ్రతా చర్యలు చేపట్టారు.

టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించాలి

- జగనన్న ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలి - ఫిబ్రవరి 6న కలెక్టరట్ల ఎదుట ఆందోళన
- 22న విజయవాడలో ధర్నా నిర్వహిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి, నిర్మాణానికి కావలసిన ఇసుక, ఇనుము, సిమెంట్ ఉచితంగా లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగర శివారులో గత ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలను సీపీఐ, ప్రజాసంఘాలు, లబ్ధిదారులతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పేదల సొంతింటి కల నెరవేరే విధంగా వారి నుంచి రూ.20 వేలు, రూ.50 వేలు, లక్ష రూపాయలు డిపాజిట్లు తీసుకొని టిడ్కో గృహాలను నిర్మాణం చేసిందని తెలిపారు. అయితే ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి తీసుకోకుండా లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు రిజిస్టర్ చేసి ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఒక్కరికి ఇంటిని ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. కర్నూలు నగరంలో 10,400 టిడ్కో గృహాలే కాకుండా మరొక 10 వేల ఇందిరమ్మ గృహాలకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించలేకపోయారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి ఉంటే ఈ రోజు కర్నూలు నగరంలో 20 వేల మంది పేద ప్రజలకు గృహ వసతి కలిగి ఉండేదన్నారు. అయితే ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల నాలుగేళ్ల నుంచి ఇళ్లకు ఇంకా రంగులు వేసే దగ్గరే ఆగిపోయారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లను అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జగనన్న కాలనీ లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1,80,000 పునాది నిర్మించుకోవడానికి సరిపోవని తెలిపారు. నేడు సిమెంట్ బస్తా రూ.400, ఇసుక లారీ రూ.40 వేలకు మార్కెట్‌లో అమ్ముతున్నారని, వైసీపీ నాయకులు ఇసుకను దోచుకుంటున్నారని విమర్శించారు. పేదల సొంతింటి కల నెరవేర్చడం కోసం ప్రభుత్వంపై ఉద్యమం సాగించడానికి సీపీఐ అధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 30న ఎమ్మార్వోలకు, ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇవ్వడం, ఫిబ్రవరి 6న 26 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల దగ్గర వేలాది మంది లబ్ధిదారులతో ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే 22వ తేదీన విజయవాడలో 26 జిల్లాల నుంచి లబ్ధిదారులు, సీపీఐ, ప్రజాసంఘాల అధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో టిడ్కో గృహాలు లబ్ధిదారులు, సీపీఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎన్.రసూల్, సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, కర్నూలు నగర సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావు, ఏఐటీయూసీ కర్నూలు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, రామంజి, కృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులు శరత్, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు గిడ్డమ్మ, రహమాన్, ఖాజా హుస్సేన్, రహమతుల్లా, బాబయ్య, రామాంజనేయులు, రేణుక సుధా, అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెరువుల్లో పట్టాలిస్తే ఇళ్లు ఎలా కట్టుకుంటారు : జగదీష్

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వకుంటే వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలన్నీ నిరుపయోగంగా మారతాయని, ముఖ్యమంత్రి పేదల పట్ల సాను కూలంగా స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ కోరారు. సీపీఐ నగర సమితి అధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని కల్పనా జోషి కాలనీలో జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో జగదీష్ మాట్లాడారు. ఇంటింటికి తిరిగి లబ్ధిదారుల స్వదస్తూరితో అర్జీలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీన పరచక పోవడంతో ఆ గృహాల్లో గబ్బిలాలు, ఇతర పక్షులు కాపురాలుంటున్నాయని ఎద్దేవా చేశారు. జగనన్న ఇళ్ల పట్టాలు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో చెరువుల్లో ఇచ్చారని, ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు సాధ్యం కాదని ప్రభుత్వం యోచించాలని హితవు పలికారు. చెరువుల్లో ఇచ్చిన పట్టాలు మార్చాలని, లబ్ధిదారులకు మరొకచోట అనువైన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రమణ, కల్పనా జోషి కాలనీ కార్యదర్శి ప్రసాద్ గౌడ్, నగర కార్యవర్గ సభ్యులు ఎల్లుట్ల నారాయణ స్వామి, గాదిలింగ, జయలక్ష్మి, ఆనంద్, రమణ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను అప్పులపాలు చేయొద్దు : జల్లి విల్సన్

జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారులను అప్పులపాలు చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో ఆదివారం బాపట్ల జిల్లాలోని అద్దంకి పట్టణ పేదలకు కేటాయించిన నాగులపాడు లేఅవుట్ నందు జగనన్న కాలనీ లబ్ధిదారులను సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు కలసి ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు పడుతున్న కష్టాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్షా 80 వేలు సరిపోవని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.5 లక్షలకు పెంచి ఇస్తే పేదలు సుఖంగా జీవిస్తారన్నారు. సిమెంటు, ఇసుక, ఇనుమును ఉచితంగా లబ్ధిదారులకు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇచ్చిందని, అందులోనే కుటుంబమంతా కిక్కిరిసిన జీవితాన్ని గడపాల్సిన పరిస్థితులను కల్పించిందన్నారు. దీంతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పాడి పశువుల పెంపకానికి అవకాశం లేకుండా చేసిందన్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు తక్షణమే స్వాధీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి జె.బి.శ్రీధర్, సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ, సీపీఐ నాయకులు కె.ఎల్.డి.ప్రసాద్, సీపీఐ అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి తుమ్మల చంద్రశేఖర్, మండల కార్యదర్శి జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

128వ రోజుకు భారత్ జోడో

గట్టిభద్రత నడుమ జమ్ముకశ్మీర్‌లో రాహుల్ యాత్ర

సాంబా: కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారత్ జోడో యాత్ర 128వ రోజుకు చేరుకుంది. చివరి దశలో భాగంగా పాదయాత్ర జమ్ముకశ్మీర్‌లోని సాంబా జిల్లాలోకి ఆదివారం ప్రవేశించింది. జమ్ములో జంట పేలుళ్ల క్రమంలో యాత్ర కోసం గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. కథువా నుంచి ప్రారంభమైన యాత్ర మధ్యాహ్నానికి సాంబాకు చేరుకోగా సోమవారం మధ్యాహ్నానికి జమ్ములోకి ప్రవేశిస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. ఉదయం 7 గంటలకు కథువాలోని హీరా నగర్ నుంచి ప్రారంభమైన యాత్ర మధ్యాహ్నం 1.15 గంటలకు సాంబా జిల్లాలోని చక్‌నానక్‌కు చేరుకున్నట్లు వెల్లడించారు. యాత్రకు అమితాదరణ లభిస్తుండటంలో దానిని ఓర్వలేక రాహుల్ గాంధీ ప్రతిష్ఠను దిగజార్చేందుకు, వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ యాత్రకు మంచి స్పందన లభించిందని, జమ్ముకశ్మీర్ ప్రజలూ ఆదరిస్తున్నారని అన్నారు. 'చాలాచోట్ల జనాన్ని వెనక్కి నెట్టేయడం కనిపించింది. కానీ ప్రజలు లెక్కచేయలేదు. రాహుల్‌గాంధీతో కలిసి కదం తొక్కేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చార'ని జైరాం రమేశ్ అన్నారు. యాత్రలో పార్టీ జమ్ముకశ్మీర్

అధ్యక్షుడు వికర్ రసూల్ వని, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమన్ భల్లా, వందలాది మంది వలంటీర్లు త్రివర్ణ పతకాలలో పాల్గొన్నారని, రోడ్డుకు ఇరువైపులా నిలుచొని రాహుల్‌కు అభివాదం చేశారన్నారు. రాహుల్‌కు సముచిత భద్రతా ఏర్పాట్లు చేశారని, పోలీసులు, సీఆర్పీఎఫ్, ఇతర భద్రతా సంస్థల పకడ్బందీ పహారా నడుమ యాత్ర శాంతియుతంగా సాగిందన్నారు. 'ఇది రాజకీయ యాత్ర కాదు... విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయడం... ప్రేమానురాగాలు, సౌభ్రాతృత్వం, మతసామరస్య సందేశాన్ని ఈ యాత్ర ద్వారా రాహుల్ ఇవ్వగా దాని ప్రాధాన్యతను ప్రజలు అర్థం చేసుకున్నారని జైరాం రమేశ్ అన్నారు. జమ్ముకశ్మీర్‌లో భారత్ జోడో యాత్రకు వ్యతిరేకంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఓ పత్రికలో రాసిన వ్యాసానికి దీటైన బదులిచ్చామన్నారు. 'ఒక వ్యక్తి పరిపాలన'పై కాంగ్రెస్ మౌనంగా ఉండబోదని నొక్కిచెప్పారు. ఏఐసీసీ జమ్ముకశ్మీర్ ఇంచార్జీ రజని పాటిల్ మాట్లాడుతూ ఎంకే భరద్వాజ్ నేతృత్వంలో హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు 13 మంది 24 నిమిషాల పాటు రాహుల్‌లో మాట్లాడినట్లు తెలిపారు. కశ్మీర్ పండిట్లతో పాటు మరికొన్ని సంఘాల ప్రతినిధులు సోమవారం రాహుల్‌ను కలుస్తారన్నారు. జమ్ముకశ్మీర్ చివరి డోగ్రా పాలకుడు హరిసింగ్ తనయుడు, పార్టీ సీనియర్ నేత కరణ్ సింగ్ ఆరోగ్యం సహకరించని కారణంగా యాత్రలో పాల్గొలేదని, ఆయన రాహుల్‌కు శుభాశీస్సులు ఇచ్చారన్నారు.

పదేళ్ల బాలిక షూలేస్ కట్టిన రాహుల్: పాదయాత్రలో భాగంగా తనతో కలిసి నడుస్తున్న పదేళ్ల పాప షూలేస్‌ను రాహుల్ గాంధీ కట్టారు. ఆయనకు అన్ని చోట్ల ఘన స్వాగతం లభించింది. డప్పుల దరువుకు కాంగ్రెస్ కార్యకర్తలు సెప్పులేసి సందడి చేశారు. స్థానికులు రాహుల్‌కు మద్దతు తెలిపారు. రాజ్యాంగాన్ని పరిరక్షించగల సమర్థుడు రాహుల్ అని కొందరు అన్నారు.

ఆర్ఆర్ఆర్ చిత్రంపై హాలీవుడ్ నటి ప్రశంస

హైదరాబాద్: టాలీవుడ్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' సృష్టించిన రికార్డుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గతేడాది విడుదలైన ఈ పిరియాడిక్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1200 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అంతేకాకుండా ఎన్నో ప్రఖ్యాత అంతర్జాతీయ అవార్డులను తన ఖాతాలో వేసుకుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సినీ ప్రముఖులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు. తాజాగా హాలీవుడ్ నటి జేన్ ఫోండా 'ఆర్ఆర్ఆర్'ని ప్రశంసించింది. 'నేను ఇంతకు ముందు లెస్లీ సినిమా చూడమని సూచించాను కదా! కానీ దానికి పూర్తి విరుద్ధంగా ఉన్న ఆర్ఆర్ఆర్ సినిమా తాజాగా నన్ను ఎంతో ఆశ్చర్యానికి గురి చేసింది. బెస్ట్ ఫారిన్ ఫిల్మ్ కేటగిరీలో ఈ సినిమా ఆస్కార్‌కు షార్ట్ లిస్ట్ అయింది. సామ్రాజ్యవాదం గురించి సీరియస్‌గా చర్చించిన బాలీవుడ్ సినిమా ఇది. ఈ చిత్రాన్ని చూస్తూ ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాను' అని జేన్

సోషల్ మీడియాలో రాసుకొచ్చింది. నెటిజన్లు స్పందిస్తూ.. 'అవును. అదో గొప్ప చిత్రం. కానీ.. అది బాలీవుడ్ చిత్రం కాదు'.. 'హలో అమాయక జెన్ ఫోండా. అది బాలీవుడ్ చిత్రం కాదు. టాలీవుడ్ చిత్రం. గాడ్ బ్లెస్ యూ చిన్నారి'.. 'భారతదేశంలో బాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ప్రాంతీయ భాష పరిశ్రమలు చాలా ఉన్నాయి. కాబట్టి భారతీయ సినిమా అనగానే బాలీవుడ్ మాత్రమేనని అనుకోకండి' అని వరుసగా కామెంట్స్ చేస్తున్నారు.

చరణ్ తీసుకొస్తే... తెలుగు రాష్ట్రాలకు వస్తా: షారూఖ్

ముంబై: షారుఖ్‌ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'పఠాన్'. దీపిక పదుకొణె కథానాయిక. జనవరి 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ట్విటర్ వేదికగా అభిమానులు అడిగిన ప్రశ్నలకు షారుఖ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ అభిమాని 'సినిమా విడుదల రోజున తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్‌కు వస్తారా' అని అడిగాడు. దీనికి షారుఖ్ స్పందిస్తూ 'రామ్‌చరణ్ తీసుకెళ్తే, తప్పకుండా వస్తా' అని సమాధానం ఇచ్చారు. విడుదలకు ముందు మీ సినిమాపై ఎలాంటి స్పందన వస్తోంది అడగ్గా, 'చాలా బాగుంది. మా కష్టాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు' అని పేర్కొన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత షారుఖ్ నటించిన సినిమా కావడంతో 'పఠాన్'పై మంచి అంచనాలు ఉన్నాయి. అభిమానులను అలరించేలా పూర్తి యాక్షన్ మూవీగా సిద్ధార్థ్ ఆనంద్ దీన్ని

కన్నడ సినిమాలే మొదటి ప్రాధాన్యం: సప్తమి గౌడ

బెంగళూరు: 'కాంతార'తో గుర్తింపు తెచ్చుకున్నారు నటి సప్తమి గౌడ. ఈ సినిమా విజయం తర్వాత ఆమె.. వేరే భాషల్లోనూ వరుస ప్రాజెక్టులు ఓకే చేస్తున్నారు. 'ది కశ్మీర్ ఫైల్స్' డైరెక్టర్ వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కించనున్న బాలీవుడ్ ప్రాజెక్ట్ 'ది వ్యాక్సిన్ వార్'లో సప్తమి కీలకపాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "కాంతార' సినిమా చూసిన తర్వాత ఓసారి వివేక్ సర్ రిషబ్‌శెట్టికి ఫోన్ చేసి నా నంబర్ తీసుకున్నారు. ఆ తర్వాత నాకు ఫోన్ చేశారు. "నేను ఒక సినిమా చేస్తున్నా. అందులో నువ్వు భాగమైతే ఆనందిస్తా" అని అన్నారు. ఆ మాటకు నేను ఎంతో సంతోషించాను. వేరే ఆలోచన లేకుండా ఓకే అనేశాను. దాంతో ఆయన నాకు 'ది వ్యాక్సిన్ వార్' స్క్రిప్ట్, అందులో నా పాత్ర గురించి వివరించారు. బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. భాషాపరంగా కాస్త ఇబ్బంది ఉన్నప్పటికీ, వివేక్ సర్ నాకెంతో సాయం చేస్తున్నారు. వేరే భాషల్లో సినిమాలు చేయడం నాకూ ఇష్టమే. కాకపోతే నా మొదటి ప్రాధాన్యం కన్నడ సినిమాలే. అక్కడ మరిన్ని మంచి చిత్రాల్లో నటించాలని ఉంది'' అని సప్తమి వివరించారు.

సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హేమలత, తపన్‌సేన్

బెంగళూరు: సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.హేమలత, తపన్‌సేన్, కోశాధికారిగా ఎం.సాయిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగుళూరులోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లోని కామ్రేడ్ రంజనా నిరులా, రఘునాథ్‌సింగ్ వేదికగా కొనసాగుతున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఆఫీస్ బేరర్లుగా 39 మంది ఉండనున్నారు. 125 మందితో వర్కింగ్ కమిటీ, 425 మందితో జనరల్ కౌన్సిల్ ఎన్నికయ్యాయి. ఉపాధ్యక్షులుగా చుక్కరాములు, ఏకే పద్మనాభన్, ఎ.ఆనందన్, ఎ.సౌందరరాజన్, ఎ.సుందరరాజన్, మెర్సికుట్టి అమ్మ, సుభాశ్ ముఖర్జీ, మాణిక్ దే, డీఎల్ కారడ్, ఎం.చిట్టిబాబు, ఎస్.వరలక్ష్మి, విష్ణుమహంతి, జి.బేబీరాణి, ఆర్.లక్ష్మయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పాలడుగు భాస్కర్, స్వదేశీ దేవ్‌రాయ్, ఎలమారం కరీం, కశ్మీర్‌సింగ్ ఠాకూర్, ప్రశాంతనంది చౌదరి, జి.సుకుమారన్, పి.నందకుమార్, డీడీ రామనందన్, ఏఆర్.సింధు, కె.చంద్రన్ పిళ్లై, మీనాక్షి సుందరం, ఉషారాణి, ఎ.సాహు, మధుమిత బందోపాధ్యాయ, అమితవగుహ, ఆర్.కరిమలయన్, తపన్‌శర్మ, ప్రమోద్‌ప్రధాన్, కె.ఎన్.ఉమేశ్, సీహెచ్.నాగేశ్వర రావు, దీపక్‌రాజన్, లలిత్‌మోహన్ మిశ్రా, సుదీప్‌దత్తా ఎన్నికయ్యారు. శాశ్వత ఆహ్వానితులుగా బసుదేవ ఆచార్య, జేఎస్ మజుందార్ హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వర్కింగ్ కమిటీకి తొమ్మిది మంది ఎన్నికయ్యారు. వారిలో వి.ఉమామహేశ్వర్‌రావు, కె.సుబ్బారావమ్మ, ఏవీ.ఎ నాగేశ్వర్‌రావు, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వర్‌రావు, ఆర్.వీ.నర్సింహారావు, కె.ఎమ్.శ్రీనివాస్, ఎం.బాలకాశి, ముజఫర్ అహ్మద్ ఉన్నారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఆర్‌కేఎస్‌వీ కుమార్, కె.మురళి, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, డీఎస్‌వీడీ ప్రసాద్, కె.అజయ్‌కుమార్, కె.రాజా రామ్మోహన్‌రావు, జి.కోటేశ్వరరావు, ఎ.నాగరాజు, అంజిబాబు, పి.తేజేశ్వరరావు, మాదాల ఎన్నికయ్యారు.

చివరిది గెలిస్తే 'మొదటికి'

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ మీద వరుసగా రెండు వన్డేలు గెలిచిన టీమ్‌ఇండియా ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకుపోతోంది. సిరీస్‌ను కోల్పోయిన కివీస్ వన్డేల్లో రెండో స్థానానికి పడిపోయింది. తాజాగా ఐసీసీ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం ఇంగ్లండ్ (113) అగ్రస్థానంలో ఉంది. కివీస్, భారత్ కూడా 113 పాయింట్లతో సంయుక్తంగా ఉన్నప్పటికీ కొద్దిపాటి తేడాతో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియా (112), పాకిస్తాన్ (106) టాప్-5లో ఉన్నాయి. భారత్- కివీస్ రెండో వన్డేకు ముందు.. న్యూజిలాండ్ 115 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండేది. భారత్ 111 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగేది. అయితే కివీస్ ఓడిపోవడం.. భారత్ విజయం సాధించడంతో ఇంగ్లండ్‌కు కలిసొచ్చింది. కివీస్ ఖాతాలో 2 పాయింట్లు కోత పడగా.. టీమ్‌ఇండియాకు 2 పాయింట్లు అదనంగా వచ్చాయి. దీంతో భారత్ మూడో స్థానంలోకి దూసుకొచ్చింది. కివీస్ రెండో స్థానంలోకి పడిపోయింది. మంగళవారం జరిగే చివరి వన్డేలోనూ టీమ్‌ఇండియా విజయం సాధిస్తే అగ్రస్థానంలోకి దూసుకెళ్లే అవకాశం ఉంది. అలాగే వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌నూ భారత్ సొంతం చేసుకొంటే.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ అగ్రస్థానంలోకి వచ్చే ఛాన్స్‌లు ఉన్నాయి.

గిల్ 10 స్థానాలు ముందుకు

కివీస్‌పై డబుల్ సెంచరీ సాధించిన శుభ్‌మన్ గిల్ (624 పాయింట్లు) ఏకంగా పది ర్యాంకులను ఎగబాకి 26వ స్థానంలోకి దూసుకొచ్చాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (750) కూడా నాలుగు స్థానాలను మెరుగుపర్చుకొని నాలుగో స్థానంలోకి వచ్చాడు. టీ20ల్లో మాత్రం సూర్యకుమార్ యాదవ్ (908 పాయింట్లు) అగ్ర స్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

భారీస్కోరుకు కంగారులేదు: రోహిత్

ముంబై: భారత కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడుగా ఆడతాడు. అయితే వన్డేల్లో సెంచరీ కొట్టి దాదాపు రెండేళ్లవుతోంది. కీలక ఇన్నింగ్స్‌లు ఆడినా వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాడు. తాజాగా న్యూజిలాండ్‌పై అర్ధశతకం సాధించాడు. కొంతకాలంగా మూడంకెల స్కోరు సాధించక పోవడంపై రోహిత్ శర్మ స్పందించాడు. 'ఇప్పుడు నేను నా గేమ్‌ను మార్చుకొనేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నా. బౌలర్లపై ఆధిపత్యం కొనసాగిస్తున్నా. ఒత్తిడి తేవడం చాలా ముఖ్యమనేది నా భావన. కొంతకాలంగా భారీ స్కోర్లు చేయలేదనే విషయం నాకూ తెలుసు. అయితే దాని గురించి పెద్దగా కంగారేమీ లేదు. ఇప్పుడు నా బ్యాటింగ్‌తో ఆనందంగానే ఉన్నా. అయితే నా బ్యాటింగ్ అప్రోచ్‌ను మాత్రం నాతోనే ఉంచుకున్నా. భారీ స్కోరు బాకీ ఉందని నాకు తెలుసు" అని అన్నాడు. రెండో వన్డేలో కివీస్‌ను కుప్పకూల్చిన బౌలర్లను రోహిత్ అభినందించాడు. "గత ఐదు మ్యాచ్‌లను పరిశీలిస్తే.. భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. మనం ఎలాంటి ఫలితం కావాలని అడిగామో.. అలాంటి డెలివరీలనే బౌలర్లు సంధించారు. భారత్ వేదికగా సూపర్ బౌలింగ్ చేశారు. విదేశాల్లోనూ ఇదే ప్రదర్శనను ఆశిస్తున్నారు. అయితే భారత బౌలర్లు ఉత్తమ నైపుణ్యం కలిగిన ఆటగాళ్లే. కివీస్‌తో రెండో వన్డేలో మావాళ్లు అదరగొట్టారు. ఈ పిచ్‌పై 250 పరుగులైనా ఛేదించగలమని భావించాం. బౌలర్లు చక్కగా బౌలింగ్ చేసి కివీస్‌ను కుప్పకూల్చారు. షమీ, సిరాజ్ లాంగ్ స్పెల్ వేయడానికి ఇష్టపడుతున్నారు. అయితే వారికి ముందు టెస్టు సిరీస్ (ఆసీస్‌తో) ఉందని గుర్తు చేశా. అందుకే పూర్తి ఓవర్లపాటు బౌలింగ్ వేయించలేదు" అని రోహిత్ శర్మ వెల్లడించాడు. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంది. తొలుత బౌలర్లు అద్భుతంగా రాణించడంతో కివీస్‌ను తక్కువ పరుగులకే కట్టడి చేశారు. అనంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ (51)తోపాటు శుభ్‌మన్ గిల్ (40రి) రాణించాడు. దీంతో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చివరి వన్డే మ్యాచ్ ఇండోర్ వేదికగా మంగళవారం జరగనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.